నవతెలంగాణ
www.navatelangana.com
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 23 ఆగస్టు 2023
1

నేతకాని చైతన్య యాత్రను విజయవంతం చేయండి

నవతెలంగాణ-జన్నారం

నేతకాని మహార్ సమస్యల సాధనకై ఆగస్టు 15 నుండి నియోజకవర్గాలలోని గ్రామాలలో సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాజకీయ చైతన్య యాత్రలను, విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకులు కొత్తపల్లి గణేష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ రాజకీయ చైతన్య యాత్ర పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేతకాని వీళ్లంతా ఐక్యంగా ఉండి పోరాటం చేసి తమ హక్కులను సాధించుకోవాలన్నారు. నేతకాని రాజకీయ చైతన్య యాత్రలో భాగంగా, ఈ నెల 26వ తేదీన మండల కేంద్రంలో రాజకీయ చైతన్య యాత్ర సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఆ సభకు నేతకాని కులస్తులంతా అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నేతకాని సంఘం నాయకులు, జాడి రాజేష్, జాడి సుధాకర్, కామెర వెంకటస్వామి, జునుగురు మల్లయ్య పాల్గొన్నారు.

కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-తాండూర్

హరితహారంలో భాగంగా నిర్వహించే కోటి మొక్కలు నాటే కార్యక్రమంలో ప్రతి పంచాయితీ అధికారులు నాయకులు భాగస్వాములు కావాలని ఎంపీఓ సత్యనారాయణ సూచించారు. మంగళవారం తాండూర్ మండలంలోని కాసిపేట గ్రామ పంచాయతీని మొబైల్ యాప్ ఇన్స్పెక్షన్ నిర్వహించారు. హరితహారంలో భాగంగా ఈ నెల 26న ప్రతి పంచాయతీలో 750 మొక్కలు నాటే కార్యక్రమం విజయవంతంగా చేపట్టాలని సూచించారు. వర్షాకాలం దృశ్య సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందున పంచాయతీల్లో పారిశుధ్య పనులను వేగవంతం చేయాలన్నారు. గ్రామ పంచాయతీలో రోడ్లు, డ్రైనేజీలను శుభ్రపరచాలని, తడి, పొడి చెత్త సేకరించి కంపోస్ట్ తయారు చేయాలని కోరారు. గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతి కార్యదర్శి సాయితేజ పాల్గొన్నారు.

రగులుతున్న అసంతృప్తి జ్వాల..!

- అధిష్టానం తీరుపై రేఖానాయక్ ఆగ్రహం
- ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన ఆజ్మీరా శ్యాంనాయక్
- ఆసిఫాబాద్ నుంచి పోటీకి దరఖాస్తు
- నేడు కార్యకర్తలతో సమావేశం కానున్న బాపురావు
- ఉమ్మడి జిల్లాలో ఆసక్తికరంగా మారుతున్న రాజకీయాలు

బీఆర్ఎస్‌లో టికెట్లు దక్కని సిట్టింగ్ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఖానాపూర్ నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న రేఖానాయక్‌కు ఈ దఫా ఆ పార్టీ టికెట్ దక్కకపోవడంతో తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. టికెట్ల కేటాయింపులో అధిష్టానం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అక్కడ టికెట్ దక్కించుకున్న ఎన్ఆర్ఐ, మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడు జాన్సన్ నాయక్ అసలు ఎస్టీ కాదని సంచలన వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. మరోపక్క కచ్చితంగా ఎన్నికల బరిలో ఉంటానని స్పష్టం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఆమె భర్త మాజీ టీజీఓ అధ్యక్షుడు, ఆజ్మీరా శ్యాంనాయక్ ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరారు. ఆసిఫాబాద్ నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఖానాపూర్ నుంచి పోటీకి రేఖానాయక్ దరఖాస్తు కూడా కాంగ్రెస్‌కు చేరినట్లు ప్రచారం జరుగుతోంది. కానీ రేఖానాయక్ మాత్రం తాను పార్టీ మారడం లేదని బీఆర్ఎస్‌లో ఉంటానని చెప్పడం ఆసక్తికరంగా మారుతోంది. బోథ్ ఎమ్మెల్యే బాపురావు ప్రస్తుతానికి పార్టీ మారడం లేదని చెబుతున్నప్పటికీ రానున్న రోజుల్లో రాజకీయ పరిణామాలు ఎటువైపు దారితీస్తాయోనని ఉత్కంఠ రేపుతోంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పది సిట్టింగ్ స్థానాల్లో ఏడుగురికి మళ్లీ బీఆర్ఎస్ టికెట్లు దక్కగా.. ముగ్గురికి మాత్రం ఆ పార్టీ అధిష్టానం మొండిచేయి చూపించింది. ఇందులో ఖానాపూర్, బోథ్ ఎమ్మెల్యేలు రేఖానాయక్, రాథోడ్ బాపురావుకు టికెట్లు నిరాకరించగా.. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కును సైతం పక్కన పెట్టారు.ఈయనను బీఆర్ఎస్ తరుపున ఆదిలాబాద్ పార్లమెంటు బరిలో నిలిపేందుకు హామీనిచ్చినట్లు తెలిసింది. దీంతో ఆత్రం సక్కు ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నారు. మిగిలిన ఇద్దరు మాత్రం తీవ్ర అసంతృప్తికి గురవుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్ మాత్రం అధిష్టానం తీరుపై తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. మంత్రి కేటీఆర్‌కు సన్నిహితుడనే కారణంగానే జాన్సన్ నాయక్‌కు పార్టీ టికెట్ కేటాయించిందని అధిష్టానం తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మరోపక్క ఇప్పటికే ఆమె భర్త కాంగ్రెస్‌లో చేరి ఆసిఫాబాద్ నుంచి పోటీకి సమాయత్తం కావడంతో త్వరలోనే రేఖానాయక్ కూడా హస్తం వైపు అడుగులు వేసే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే ఖానాపూర్ నుంచి పోటీ చేసేందుకు కాంగ్రెస్ అధిష్టానానికి ఆమె తరుపున దరఖాస్తు వెళ్లినట్లు తెలుస్తోంది. కానీ ఆమె మాత్రం తాను బీఆర్ఎస్‌లోనే ఉంటానని పేర్కొంటున్నారు. కానీ కచ్చితంగా రానున్న అసెంబ్లీ ఎన్నికల బరిలో ఉంటానని స్పష్టం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

నేడు కార్యకర్తలతో బాపురావు సమావేశం..?

బోథ్ ఎమ్మెల్యేగా రెండు దఫాలుగా పనిచేస్తున్న రాథోడ్ బాపురావుకు ఈ సారి బీఆర్ఎస్ పార్టీ టికెట్ నిరాకరించింది. ఈయన స్థానంలో నేరడిగొండ జడ్పీటీసీగా వ్యవహరిస్తున్న అనిల్‌జాదవ్‌కు గులాబీ టికెట్ కేటాయించింది. దీంతో రాథోడ్ బాపురావుతో పాటు ఆయన వర్గీయులు అసంతృప్తికి గురవుతున్నారు. ప్రస్తుతం తాను పార్టీ మారే ఆలోచన లేదని ముఖ్యమంత్రి కేసీఆర్ వెంటే ఉంటానని బాపురావు స్పష్టం చేస్తున్నారు. బుధవారం ఓ గార్డెన్‌లో నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటుచేస్తున్నట్లు తెలిసింది. కార్యకర్తల అభీష్టం మేరకు ఈ సమావేశంలో ఏ నిర్ణయం తీసుకుంటారోనని సర్వత్రా ఆసక్తి రేపుతోంది. మరోపక్క ముథోల్‌లో అక్కడి సిట్టింగ్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి పార్టీ మరోసారి టికెట్ కేటాయించింది. అక్కడ అసమ్మతి తీవ్రస్థాయిలో ఎదురైనా అధిష్టానం వాటిని పట్టించుకోలేదు. మరోసారి విఠల్‌రెడ్డికే టికెట్ కేటాయించడం ప్రాధాన్యం సంతరించుకుంది. మంచిర్యాలలోనూ టికెట్ ఆశించిన పలువురు ఆశావహులు నిరాశకు గురవుతున్నట్లు తెలుస్తోంది. కొందరు ముఖ్య నాయకులు రెండు మూడు రోజుల్లో కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకున్నట్లు తెలుస్తోంది. మిగితా కొన్ని నియోజకవర్గాల్లోనూ కొందరు నాయకులు టికెట్లు ఆశించినప్పటికీ అధిష్టానం వారిని పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో వారిలోనూ అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. టికెట్ల పర్వం ప్రారంభం కాగానే ఉమ్మడి జిల్లా రాజకీయాలు ఆసక్తికరంగా మారుతున్నాయి. మరికొన్ని రోజుల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల జాబితా కూడా వెల్లడికానున్న నేపథ్యంలో రాజకీయ పరిణామాలను మరింత రసవత్తరంగా మారే అవకాశం కనిపిస్తోంది.

మహిళలకు బీఆర్ఎస్ అన్యాయం చేసింది

- కచ్చితంగా ఎన్నికల బరిలో ఉంటా
- ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖానాయక్



నవతెలంగాణ-జన్నారం.

బీఆర్ఎస్ పార్టీ మహిళలకు అన్యాయం చేసిందని, ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏఆర్ఎస్ కళాశాలలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. 9 సంవత్సరాలు ఎమ్మెల్యేగా ఉండి ఖానాపూర్ నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా అన్నారు. కాని కేసీఆర్ తనకు టికెట్ ఇవ్వకపోవడం దారుణం అన్నారు. కేవలం ఎస్టీ గిరిజన మహిళ అయినందుననే తనను పక్కనపెట్టి ఓ ఎన్నారైకి టికెట్ కేటాయించడం సబబు కాదన్నారు. కేవలం కేటీఆర్ స్నేహితుడు అనే ఒకే ఒక కారణంతో అతనికి, టికెట్ కేటాయింరన్నారు. తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీని ప్రభుత్వాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి అన్ని గ్రామాలలో పార్టీని బలోపేతం చేశా అన్నారు. అయినా తనను పక్కన పెట్టడం సమంజసం కాదన్నారు. ఇప్పటికి సీఎం కేసీఆర్ నాపై నమ్మకం ఉంచి ఖానాపూర్ టికెట్ ఇవ్వాలని కోరుతున్నామన్నారు. టికెట్ ఇచ్చిన ఇవ్వకపోయినా ఖానాపూర్ అసెంబ్లీ నుంచి తప్పకుండా పోటీ చేస్తానని ప్రకటించారు. ప్రజలతో మమేకమై గ్రామ గ్రామాన తిరిగి మద్దతు కూడా కట్టుకొని, పోటీ చేస్తా అన్నారు. త్వరలో ఏ పార్టీలో వెళ్ళబోయేది మీడియా ముందు చెబుతా అన్నారు. 9 సంవత్సరాలు ఖానాపూర్ ప్రజలకు ఎంతో సేవ చేశానని వారే తనను మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపిస్తారని నమ్మకం ఉందన్నారు.

కనీస వేతనం అమలుచేయాలి

నవతెలంగాణ-జైనూర్

సమగ్ర శిక్షణ ఉద్యోగుల కనీస వేతనాల స్కేల్ అమలుచేయాలని తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పవార్ తుకారాం అన్నారు. మంగళవారం మండలంలోని పొచ్చంలొద్ధి గ్రామ సమీపంలో గల కేజీబీవీ పాఠశాలలో సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మండల శాఖ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సాధించినప్పటి నుంచి విద్యా శాఖ సమగ్ర శిక్షణ ఒప్పందం పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న సమగ్ర శిక్షణ ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో సమగ్ర శిక్షణ ఉద్యోగులందరికి ఉద్యోగభద్రత కల్పించి ప్రతి ఉద్యోగికి జీవిత బీమా రూ.10 లక్షలతో పాటు ఆరోగ్య బీమా రూ.ఐదు లక్షల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యా శాఖ నియామకాల్లో వేటేజ్ కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యాభివృద్ధికై గత 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నామని తెలిపారు. విద్యా శాఖలో కీలకంగా ఉంటూ రాష్ట్రంలో ఉద్యోగ అర్హత కలిగి ఉండేందుకు రాబోయే రోజుల్లో పోరాటానికి సిద్ధమవుతున్నామని తెలిపారు. అనంతరం సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కృష్ణ, మండల అధ్యక్షుడిగా వందన, ఉపాధ్యక్షులుగా భారతి, ప్రధాన కార్యదర్శిగా రవీందర్, సహాయ కార్యదర్శిగా శారద, కోశాధికారిగా సీతారాం, అధికార ప్రతినిధిగా ఎంపీఎస్ తుకారాం, మీడియా ప్రతినిధిగా జంగు, న్యాయ సలహాదారులుగా సంధ్యతో పాటు సభ్యులుగా గిరిజాబాయి, కమల, కృష్ణవేణి, వనిత, సంగీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలి

- ఆర్‌జేడీ సత్యనారాయణరెడ్డి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్‌జేడీ) సత్యనారాయణరెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉన్నతి లక్ష్య కార్యక్రమాలు ఉన్నత పాఠశాలల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయన్నారు. 6 నుండి 9 తరగతులకు చెందిన విద్యార్థులు మౌలిక సామర్థ్యాలతో పాటు కనీస అభ్యసన సామర్థ్యాలు పెంపొందించడానికి శిక్షణ శిబిరం తోడ్పడుతుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు దీనిని సద్వినియోగం చేసుకోవడంతో పాటు పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి జిల్లా విద్యాశాఖ అధికారి ఉదయ బాబు, ఏఎంఓ శ్రీనివాస్, రిసోర్స్ పర్సన్‌లు వెంకటేశ్వర స్వామి, సుభాష్, అనురాధ పాల్గొన్నారు.

మూగజీవాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-కౌటాల

మూగజీవాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని ముత్తంపేట గ్రామంలో ఉచిత పశు వైద్యశిబిరాన్ని సర్పంచ్ ఆదె శ్రీనివాస్‌తో ప్రారంభించి అనంతరం పశువులకు టీకాలు వేశారు. రైతులెవరైన పశువులకు, గేదెలకు, గొర్రెలకు, మేకలకు ఎలాంటి వ్యాధులు సోకని తమకు సమాచారం అందిస్తే ఉచితంగానే వైద్యం చేస్తానని రైతులకు బరోసా కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది సందీప్, కేశవ్, రాజన్న, భిక్షపతి, స్రవంతి, శోభన్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆర్కే ఓసీపీని సందర్శించిన జీఎం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన మందమర్రి జనరల్ మేనేజర్ ఎ.మనోహర్ మంగళవారం ఆర్కే ఓసీపీని సందర్శించారు. ఈ సందర్భంగా అధికారులకు ఉత్పత్తి, ఉత్పాదకతపై సూచనలు చేశారు. అధికారులు, ఉద్యోగులు సమన్వయంతో పని చేసి నిర్దేశించిన లక్ష్యాలను రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఏరియా ఇంజనీర్ జె.నాగరాజు, ఆర్కే ఓసిపి ప్రాజెక్టు ఆఫీసర్ ఎం.గోవింద రావు, మేనేజర్ సీహెచ్ వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు ఇంజనీర్ పి.మహేందర్, టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ కె.రాజ్ కుమార్, ఏఐటీయూసీ పిట్ సెక్రెటరీ ఏ.ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ మహా సభల పోస్టర్ల విడుదల

నవతెలంగాణ-కాసిపేట

ఏఐటీయూసీ సెంట్రల్ 16వ మహాసభలను ఈ నెల 25,26,27 తేదీల్లో గోదావరిఖనిలో నిర్వహించడం జరుగుతుందని, కార్మికులు భారీగా తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేశ్ కోరారు. మంగళవారం మందమర్రి ఏరియాలోని కాసిపేట 2వ గనిపై సంబంధిత పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ ఫిట్ సెక్రెటరీ గొల్ల శ్రీనివాస్, కొండపల్లి నర్సయ్య, జావిద్, నీలయ్య, రాజ కొమురయ్య, రత్నం రాజలింగు, వేణుగోపాల్, గట్టు అశోక్, తీర్థాల చంద్రయ్య పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల

- మంజూరుచేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు
- జేఎన్‌టీయూకు అనుబంధంగా కొనసాగింపు
- జిల్లా విద్యార్థులకు అందుబాటులో సాంకేతిక విద్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇంజనీరింగ్ కళాశాల మంజూరైంది. జిల్లా విద్యార్థులకు సాంకేతిక విద్య అందుబాటులోకి రానుంది. ఈ కళాశాలను మంజూరుచేస్తూ ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ హామీనిచ్చారు. తాజాగా సాంకేతిక విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. జేఎన్‌టీయూకు అనుబంధంగా ఈ కళాశాల కొనసాగనుంది. దీంతో ఉమ్మడి జిల్లా విద్యార్థులకు స్థానికంగానే సాంకేతిక విద్య అందనుంది. ప్రస్తుతం హైదరాబాద్, వరంగల్ వంటి ప్రాంతాలకు వెళ్లి చదివే విద్యార్థులు ఈ కళాశాల ప్రారంభమైతే జిల్లాలోనే ఇంజనీరింగ్ విద్యను పూర్తిచేసేందుకు ఆస్కారం ఉంటుంది.

జిల్లా విద్యార్థులకు మేలు

విద్యాపరంగా వెనుకబడిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలలు లేవు. గతంలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఓ ప్రయివేటు కళాశాల ఉన్నప్పటికీ అప్పట్లోనే మూతపడి..ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు తెలిసింది. తాజాగా ప్రభుత్వం సర్కారు ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటుచేస్తూ నిర్ణయం తీసుకోవడంతో జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు ఫీజు రియంబర్స్‌మెంట్ సౌకర్యంతో సులభంగా ఇంజనీరింగ్ విద్యను అభ్యసించేందుకు అవకాశం లభిస్తుంది. ఇంటర్ పూర్తికాగానే ఎంసెట్‌లో ర్యాంకు సాధిస్తే బీటెక్‌లో చేరేందుకు అవకాశం ఉంటుంది. కంప్యూటర్‌సైన్స్, ఐటీ, సివిల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ తదితర కోర్సుల్లో చేరేందుకు అవకాశం లభిస్తుంది. ఒక్కో కోర్సులో సుమారు 80మంది విద్యార్థులను పరిగణనలోకి తీసుకున్నా.ఏడాదికి సుమారు 300 నుంచి 400మంది విద్యార్థులకు ఈ కళాశాలలో సీట్లు లభించనున్నట్లు తెలుస్తోంది. ఈ కళాశాలను ఉమ్మడి జిల్లాలో ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది త్వరలోనే వెల్లడికానుంది.

కాంగ్రెస్‌లో చేరిన ఎంపీపీ శ్రీనివాస్



నవతెలంగాణ-దండేపల్లి

బీఆర్ఎస్ ఎంపీపీ గడ్డం శ్రీనివాస్ మంగళవారం కాంగ్రెస్‌లో చేరారు. మాజీ ఎమ్మెల్సీ కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. దీంతో మండలంలో రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఉన్నట్టుండి అధికార పార్టీ ఎంపీపీ పార్టీ మారడంతో బీఆర్ఎస్ మండల నాయకుల్లో అంతర్మథనం మొదలైంది. ఎంపీపీతో పాటు బీఆర్ఎస్ నాయకులు, సర్పంచులు సైతం పార్టీ మారారు. మాజీ ఎంపీపీ ముత్యాల శంకరయ్య, మాజీ సర్పంచ్ లింగాల తిరుపతి, మాజీ ఎంపీటీసీ ముత్తే నారాయణ, పలు గ్రామాల వార్డు సభ్యులు కాంగ్రెస్‌లో చేరారు. పార్టీ విధానాలు నచ్చకే పార్టీ మారినట్లు ఎంపీపీ శ్రీనివాస్ తెలిపారు. ప్రజలు బీఆర్ఎస్ విదానాలను ఎవరు స్వాగతించటంలేదని ఆయన అన్నారు. ఈ సందర్భంగా ప్రేమ్‌సాగర్ రావు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనని ధీమా వ్యక్తం చేశారు. గ్రామాల్లో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పార్టీ గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



నవతెలంగాణ-జన్నారం

ఎన్నికలలో భాగంగా మంగళవారం మండలంలోని రాంపూర్, తిమ్మాపూర్, తపాలాపూర్, సింగరైపేట్, మహమాదాబాద్, రొటీగూడ, చింతగూడ, బొమ్మెన గ్రామాలలోని పోలింగ్ బూత్ లను తహసీల్దార్ వనజా రెడ్డి పరిశీలించినారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ప్రచూరించేందుకు ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో పేరు ఉందా లేదా చూసుకోవాలన్నారు. ఆ జాబితాలో, తప్పు ఒప్పులు ఏవైనా ఉంటే అభ్యంతరాలు కార్యాలయం తెలపాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ భానుచందర్, తిమ్మాపూర్ సర్పంచ్ జాడిగంగాధర్, కార్యదర్శి లావణ్య పాల్గొన్నారు.

విద్యతోనే ఆదివాసుల అభివృద్ధి

- జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్
- ఆదివాసీల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యతోనే ఆదివాసీల అభివృద్ధి సాధ్యమవుతుందని జిల్లాలోని ప్రతి ఆదివాసి బిడ్డ విద్యనభ్యసించాలని జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్ అన్నారు. మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ఎస్పీ సురేష్ కుమార్ అధ్యక్షతన ఆదివాసి పటేళ్ల, గోండ్వాన రాయి సెంటర్, సర్ మెడి, సభ్యులతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఆదివాసి, గిరిజన బిడ్డ ఉన్నత చదువులు చదువుకుని తమ ఆదివాసీలకు మార్గదర్శకంగా నిలిచి అభివృద్ధి చెందేలా అందరూ సమిష్టిగా కృషి చేయాలని అన్నారు. జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలలో తాత్కాలిక రహదారుల నిర్మాణం చేపట్టి రాకపోకలు సాగించే విధంగా ఏర్పాట్లు చేయాలని, ఆదివాసి గ్రామాలలో వైద్య సేవలపై ప్రత్యేక దృష్టి సారించి ఎల్లవేళలా మెరుగైన వైద్య సేవలు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆదివాసీ యువతి యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో భాగంగా కుట్టు మిషన్ల శిక్షణ, పంపిణీ, జైపూర్ కృత్రిమ అవయవాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలను భవిష్యత్తు తరాలకు అందించేందుకు ఆదివాసీ పటేళ్ల, సర్ మెడిలు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. భారీ వర్షాల సమయంలో తమ గ్రామాలలో అత్యవసర చర్యలు, సహకారం అందించేందుకు కృషి చేయాలని, సమస్యల పరిష్కారానికి జిల్లా అధికారుల సమన్వయం చేసుకోవాలని తెలిపారు. రాయి సెంటర్ల ఏర్పాటుకు స్థలాల గుర్తింపు, నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు గిరి వికాసం పథకంలో భాగంగా చేపట్టే అభివృద్ధి పనులను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పాత కలెక్టరేట్ భవనాన్ని యువజన శిక్షణ కేంద్రానికి అందజేసి సీఎస్ఆర్ నిధుల ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ఆదివాసి పటేళ్ల తమ గ్రామాలలో 18 సంవత్సరాలు వయసు నిండిన వారందరూ ఓటరు జాబితాలో తమ వివరాలు నమోదు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. జిల్లా ఎస్పి సురేష్ కుమార్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన ప్రాంత ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లపుడూ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఇటీవల తెలుగు విశ్వవిద్యాలయం ప్రకటించిన ప్రతిభ పురస్కార గ్రహీతల్లో ఒకరైన వెడ్మా శంకర్(కిక్రి కళాకారుడు), వెడమ రాము(ఫ్లూట్ కళాకారుడు)లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ అడ్మిన్ అచ్చేశ్వరరావు, గోండ్వాన జాతీయ మహాసభ ఉపాధ్యక్షులు సిడాం అర్జు, రాజ్ గోండు సేవా సమితి జిల్లా అధ్యక్షులు కుంరం మాంతయ్య, గోండ్వాన పంచాయతీ రాయి సెంటర్ జిల్లా మేడి కుర్సెంగ మోతిరాం, ప్రదాన్ సంఘం జిల్లా అధ్యక్షులు పెందోర్ సుధాకర్, తోటి సంఘం జిల్లా అధ్యక్షుడు ఆత్రం సంతోష్ కుమార్, నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షులు బొమ్మెన దశరథ్, ఆంద్ సంఘం జిల్లా అధ్యక్షులు నారాయణ పాల్గొన్నారు.

బోదకాలు మాత్రల పంపిణీ పరిశీలన

నవతెలంగాణ-దండేపల్లి

వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మండలంలో కొనసాగుతున్న బోదకాలు మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య బృంధం పరిశీలించింది. మండంలోనిగూడెం, నంబాల, ద్వారక, మేదరిపెట్, రెబ్బెనపల్లి గ్రామాలలో మాత్రల వినియోగంపై ప్రజలకు వివరిస్తున్న తీరును ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మాత్రలు పంచి వెళ్లకుండా దగ్గర ఉండి వేసుకునేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ముందుగా ఐరన్ మెక్టిన్ ఆ తర్వాత డిఈసి మాత్రలు వేసుకునేల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. భవిష్యత్ తరాలకు బోధకాలను దూరం చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టిందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కుష్టు వ్యాధి నివారణకు స్పర్శ లేని మచ్చలు ఉన్న వారిని గుర్తించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో తనిఖీ బృందం సభ్యులు సీహెచ్ఓ రామ్మూర్తి, హెల్త్ ఎడ్యుకేటర్ అల్లాడి శ్రీనివాస్, సబ్ యూనిట్ అధికారి నాందేవ్, హెల్త్ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఏఎన్ఎంలు విజయ, కృష్ణవేణి, శ్యామల పాల్గొన్నారు.



బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదికతపై సమీక్ష

నవతెలంగాణ నస్పూర్

2024-25 ఆర్థిక సంవత్సర బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదికత రవాణా మొదలగు వాటిపై శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, జనరల్ మేనేజర్ కార్పొరేట్ (ఐ అండ్ పీఆర్) ఆర్థిక ప్రణాళిక కమిటీ అధ్యక్షుడు రవికుమార్ జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్లు మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియాకు బొగ్గు ఉత్పత్తి, ఉత్పదకత రవాణా లక్ష్యాలు సాధించడానికి గనుల వారిగా కావలసిన యంత్రాలు, యంత్ర సామాగ్రి తదితర అంశాల గురించి కూలంకషంగా చర్చించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం కె రఘు కుమార్, ఇన్‌ఛార్జి ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్ట్ ఆఫీసర్లు ఎం.శ్రీనివాస్, వి.పురుషోత్తమరెడ్డి, ఏజెంట్లు ఏవీ రెడ్డి, గోపాల్ సింగ్, రాముడు పాల్గొన్నారు.

మున్నూరు కాపు యువకులు అన్ని రంగాల్లో రాణించాలి

ఆసిఫాబాద్ : మున్నూరు కాపు యువకులు అన్ని రంగాల్లో రాణించాలని ఆ సంఘం నాయకులు ఆకాంక్షించారు. మండలానికి చెందిన యువకులు పిడుగు మణికంఠ, గజ్జల అక్షయ్, సాయి, ఉమేర్‌లు బీఎస్ఎఫ్ సిఐఎస్ఎఫ్ ఉద్యోగాలకు ఎంపిక కాగా వారిని సంఘం తరపున మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ చిన్న వయస్సులోనే ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందని, భవిష్యత్తులో మరిన్ని మంచి పదోన్నతులు పొంది జిల్లాకి మంచి పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా నాయకులు మిట్ట వెంకన్న, గాజుల జక్కయ్య, గడ్డల సురేష్, మిట్ట తిరుపతి, నారా ఆశన్న, మనిగొండ వెంకటేశం, పొలంపల్లి గణపతి పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

నవతెలంగాణ-కుభీర్

మండలంలోని వ్యవసాయ సహకార సంఘం సీఈఓ క్రాంతికుమార్, ఉపాధిహామీ ఏపీఓ హరిలాల్ ఇటీవల 15ఆగస్టున జిల్లా కేంద్రంలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ అవార్డులను అందుకున్న సందర్భంగా మంగళవారం మండల బీఆర్ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూము రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ శంకర్ చవాన్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్‌ల ఆధ్వర్యంలో మండల బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పని చేసిన వారికి తప్పకుండా ఎదో రూపంలో ప్రతి ఫలం అందుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు వారి వారి పనిని చేస్తే గ్రామీణ ప్రజలు వారికి ఎల్లవేళలా రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, మహిపాల్‌రెడ్డి, నర్సారెడ్డి, దేవిదాస్, తిరుమల నారాయణ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ కార్యకర్తలు ఉన్నారు.

అడెల్లి ఆలయ దుకాణ సముదాయముల బహిరంగ వేలం

నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని అడెల్లి శ్రీమహా పోచమ్మ దేవస్థానం, నందు ఒక సంవత్సరం పాటు వివిధ రకాల వస్తువులు విక్రయించేందుకు గాను లీజు హక్కు కోసం బహిరంగ వేలం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి రంగు రవికిషన్‌గౌడ్ తెలిపారు. బహిరంగ వేలం (1) కొబ్బరికాయలు అమ్ముకునే హక్కు, (2) ప్యాలాలు, పుట్నాలు అమ్ముకునే హక్కు, (3) టెంట్ హౌజ్ వంటపాత్రలు కిరాయికి ఇచ్చుకునే హక్కు, (4) బొమ్మలు, కంకణాలు, సీడీలు, ఫోటోలు అమ్ముకునే హక్కు, (5) ఇతరములు, (6) ఇడుపుడు పిల్ల మేకలను సేకరించుకునే హక్కు, (7) టోల్ టాక్స్ వసూలు చేసుకునే హక్కు, (8) పూలదండలు అమ్ముకునే హక్కు, (9) కొబ్బరి ముక్కలు సేకరించే హక్కు, కాలపరిమితి సెప్టెంబర్ 1నుంచి 2024 ఆగస్టు 31 వరకు ఉంటుంది. ఆసక్తి కలవారు బుధవారం ఉదయం 11గంటలకు బహిరంగ వేలంలో పాల్గొనాల్సిందిగా కోరారు.

అభివృద్ధిలో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతా..



నవతెలంగాణ-లక్ష్మణచాంద

అభివృద్ధిలో జిల్లాను అగ్రస్థానంలో నిలుపుతానని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో పర్యటించారు. బోరిగాం గ్రామంలో నూతనంగా నిర్మించతలపెట్టిన 20 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాం నిర్మాణం పనులు పరిశీలించారు. జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధిలో రాష్ట్రంలో అగ్రగామిగా నిలుపుతానని అన్నారు. మూడోసారి అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల నాయకులు మంత్రిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మెన్ రఘునందన్‌రెడ్డి, రాంకిషన్‌రెడ్డి, ఎంపీపీ అద్వాల పద్మ రమేష్, జెడ్పీటీసీ ఓస రాజేశ్వర్, మండల ఇన్‌చార్జీ సురేందర్‌రెడ్డి, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, కాంట్రాక్టర్ లక్కడి జగన్ మోహన్‌రెడ్డి, నాయకులు శాతం గంగారాం, మండల సర్పంచ్లు, ఎంపీటీసీలు, తహసీల్దార్ శ్రీలత, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్లు అందజేత

నవతెలంగాణ-ఖానాపూర్

ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 90 రోజుల శిక్షణ తీసుకొని పూర్తి చేసుకున్న నిరుపేద ఎస్సీ మహిళలకు మంగళవారం ఎమ్మెల్యే రేఖ నాయక్ కుట్టుమిషన్లు అందజేశారు. స్థానికంగా ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సన్ స్కిల్స్ ఇనిస్టిట్యూట్ ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్లు ధృవపత్రాలను మహిళలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్సీ మహిళా ఆర్థిక అభ్యున్నతికి టైలరింగ్ ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సన్ స్కిల్స్ ఇనిస్టిట్యూట్ నిర్వాహకులు, మహిళలు యువతులు, ఖానాపూర్ మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో జిల్లా స్థాయి యోగ పోటీలు

నవతెలంగాణ-కడెం

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్వర్యంలో జిల్లా స్థాయి యోగ పోటీలు మండలంలోని అంబారిపేట్ గ్రామంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అజ్మీరా రేఖా నాయక్ హాజరయ్యారు. కాగా పాఠశాల ఉపాధ్యాయ బృందం ఎమ్మెల్యే రేఖ నాయక్‌ని సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థిని, విద్యార్థులకు క్రీడాకారులకు యోగ పట్ల సందేశం ఇచ్చారు. యోగవల్ల మనిషిలో ఏకాగ్రత పెంపొంది చదువులో ప్రతిభ కనబరచడానికి దోహదపడుతుందని అన్నారు, క్రీడలు మానసికోల్లాసానికి శారీరక ధృఢత్వానికి ఎంతగానో ప్రభావితం చేస్తాయని సూచించారు. ఈ యోగ పోటీల్లో 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు. సెలెక్ట్ అయిన వారిని జోనల్ స్థాయికి పంపడం జరుగుతుందని, ఎస్‌జీఎఫ్ నిర్మల్ జిల్లా సెక్రటరీ వై.రమణరావ్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రేమ్‌దాస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కట్ల సింధుజ, సాగర్, కడెం సర్పంచ్ కొండాపూరం అనూష లక్ష్మణ్, నచ్చన్‌ఎల్లాపూర్ సర్పంచ్ బోడ్డు గంగన్న, ఆత్మ కమిటి చైర్మెన్ కానూరి సతీష్, పీఈటీలు వెంకటరమణ, టి.ఇమ్రాన్, టి.ప్రభాకర్ స్థానిక నాయకులు పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్ల పంపిణీ

నవతెలంగాణ-ఖానాపూర్

లయన్స్ క్లబ్ ఆఫ్ ఖానాపూర్ అన్నదాత ఆధ్వర్యంలో మంగళవారం ఖానాపూర్ మండలంలోని తర్లపాడు గ్రామంలో ఎల్‌సీఐఎఫ్ ద్వారా మంజూరు చేయబడిన దుప్పట్లు పంపిణీ చేశారు. అధ్యక్షుడు లయన్ సాదుల వెంకటస్వామి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అడిషనల్ క్యాబినెట్ ట్రెజరర్ పాలెపు సుదర్శన్, డీసీలు అయిలినేని సంజీవరావు, కారింగుల వెంకటేశ్వర్లు, తాండ్ర చంద్రశేఖర్‌రావు, డైరెక్టర్లు ఏనుగు భూపతిరెడ్డి, మహాజన్ జితెందర్, ఏ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నోట్లో గడ్డితో మిషన్ భగీరథ కార్మికుల నిరసన

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని పూసిగూడ పంప్‌హౌజ్ వద్ద మంగళవారం మిషన్ భగీరథ కార్మికులు నోట్లో గడ్డితో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులను పనుల్లో పెట్టి సమస్యలు పరిష్కరించక కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. సమస్యలను పరిష్కరించక పోవడంతో ఈ సందర్భంగా వారు గ్రామాలలో వాటర్ సప్లై చేస్తూ నిరసనలు తెలియజేస్తున్నామని అన్నారు. ఇప్పటికైనా మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్‌లోని ఐదు నెలల వేతనాలను వెంటనే ఇవ్వాలని అన్నారు. ఉద్యోగ భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. ప్రమాదబీమా రూ.50లక్షలు ఇవ్వాలని, కంపెనీ లాభాలలో కార్మికులకు బోనస్, యూనిఫామ్, టార్చ్‌లైట్, ప్రయాణ చార్జీల అలవెన్స్ తదితర సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వాన్ని కంపెనీ, యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కారం కాకా పోతే వచ్చే నెల 2న సమ్మె చేస్తామని తెలిపారు. నిరసన కార్యక్రమంలో శుభం, సంతోష్, నగేష్, వికాస్‌కృష్ణ, మధుకర్ పాల్గొన్నారు.

కార్యకర్తలు అపోహలను నమ్మొద్దు

- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేడ్మ బొజ్జు పటేల్

నవతెలంగాణ-ఖానాపూర్



కార్యకర్తలు అపోహలను నమ్మవద్దని కాంగ్రెస్ పార్టీలోకి అందరూ ఆహ్వానితులేనని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేడ్మ బొజ్జు పటేల్ అన్నారు. మంగళవారం ఖానాపూర్ పట్టణంలోని జేకే ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల నుంచి నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి ఎంతో కృషి చేశామని అన్నారు. ఖానాపూర్ టికెట్ అధిష్టానం తనకి కేటాయిస్తుందని అన్నారు. కార్యకర్తలు సమన్వయంతో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీలో బక్షి నాయక్, అజ్మీరా శ్యామ్ నాయక్‌లు సైతం చేరినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సముద్రం లాంటిదని ఎవరైనా చేరవచ్చని అన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు అందరం కలిసి పనిచేయాలని అన్నారు. ఈ సమావేశంలో నాయకులు దయానంద్, యూసుఫ్‌ఖాన్, ఖదర్ల గంగనర్సయ్య, జహీర్, మాజీద్, రాజుల సత్యం, నిమ్మల రమేష్, షబ్బీర్ పాషా, లక్ష్మీపతిగౌడ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జహీర్, ఆసిఫ్, సలీం నియోజకవర్గ నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై ఎలాంటి ఆందోళన చెందవద్దు

- నిమ్మరసం ఇచ్చి దీక్ష విరమింపజేసిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



నవతెలంగాణ-నిర్మల్

మాస్టర్ ప్లాన్‌పై ఎలాంటి ఆందోళన చెందవద్దని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అన్నారు. నూతన మాస్టర్ ప్లాన్‌పై గత కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట రైతులు నిరవధిక దీక్ష చేపట్టారు. కాగా మంగళవారం మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి నిమ్మరసం ఇచ్చి రైతులతో దీక్షను విరమింపజేశారు. మంత్రి హామీతో రైతులు సైతం దీక్ష విరమిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. ఇది డ్రాఫ్ట్ నోటిఫికేషన్ మాత్రమేనని, ఇది చివరి మాస్టర్ ప్లాన్ కాదని, ప్రజలు గ్రహించాలని అన్నారు. ప్రజల అభ్యంతరాలను, సలహాలు, సూచనలు పరిగణలోకి తీసుకుంటామన్నారు. ఎట్టి పరిస్థితుల్లో ఏ ఒక్కరికీ అన్యాయం జరగనివ్వమని అన్నారు. తమది రైతు సంక్షేమ ప్రభుత్వమని, ప్రజలకు, రైతులకు వ్యతిరేఖంగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఎలాంటి నిర్ణయాలు తీసుకోదన్నారు. ప్రతిపక్షాల నాయకులు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. వారి మాటలు నమ్మి మీరు మోసపోవద్దన్నారు. ఏ ఒక్కరికీ నష్టం జరగకుండా చూస్తామని మంత్రి దీక్ష చేస్తున్న రైతులకు వివరించారు. తాను 260 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు ప్రతిపక్ష నాయకులు విమర్శలు పత్రికల్లో వచ్చాయని, నిరాధార ఆరోపణలు చేయడం కాదని, నాకు ఎక్కడ భూమి ఉందో ప్రతిపక్ష నాయకులు నిరూపిస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు. లేదంటే ఆరోపణలు చేసిన వారు ముక్కు నేలకు రాసి క్షమాపణలు చెప్పాలని అన్నారు. నిజాయితీగా ఉన్నామని అందుకే మూడు దశాబ్దాలకు పైగా ప్రజలు మమ్మల్ని ఆదరిస్తున్నారని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మెన్ గంధ్రత్ ఈశ్వర్, నాయకులు పాల్గొన్నారు.

ఆర్జీయూకేటీలో మహిళల భద్రతపై అవగాహన



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో మంగళవారం ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ వెంకటరమణతో కలిసి రాష్ట్ర పోలీసు మహిళా భద్రతా విభాగం అదనపు డీజీ శిఖాగోయల్ మాట్లాడారు. విద్యార్థులు భయాన్ని వీడిచి పెట్టాలని అన్నారు. సమస్యకు పరిష్కారం మరణం కాదని చావుతో అన్ని సాధ్యం కావని అన్నారు. సమస్యలకు భయపడి ఆత్మహత్యలకు పాల్పడితే అగమయ్యేది మన కుటుంబమేనని అన్నారు. సమస్య ఏదైనా ధైర్యంగా ముందుకు వచ్చి పోలీసులను సంప్రదించాలని కుటుంబ సభ్యులు, స్నేహితుల సహకారం తీసుకోని ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యాసంస్థల్లో ర్యాగింగ్‌ను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు ఉన్నాయని అన్నారు. అత్యవసరమైతే 100కు, 102కు కాల్ చేయాలని లేదంటే షీటీం వాట్సాప్ నెంబర్ ద్వారా కూడా ఫిర్యాదు చేయొచ్చునని వివరించారు. ప్రతి ఆడబిడ్డ తమ స్మార్ట్ ఫోన్‌లో హాక్‌ఐ యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవాలని దీని ద్వారా ట్విట్టర్, ఫెస్ బుక్ పోస్టు ద్వారా ఫిర్యాదు చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల స్వీపర్లకు కనీస వేతనమివ్వాలి

- 46వ రోజుకు చేరుకున్న సమ్మె



నవతెలంగాణ-నిర్మల్

ప్రభుత్వ పాఠశాల స్వీపర్లకు కనీస వేతనం జీఓ 60 ప్రకారం వేతనము ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మన సురేష్ అన్నారు. మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట ప్రభుత్వ పాఠశాలల స్వీపర్ల సంఘం సమ్మె 46 రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 46 రోజులుగా సమ్మె చేస్తున్న తెలంగాణ ప్రభుత్వ ఇప్పటిదాకా పట్టించుకపోవడం సిగ్గుచేటన్నారు. తెలంగాణ రాష్ట్ర, జిల్లా, మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాల పరిధిలో గత 40 సంవత్సరాలుగా నెలకు రూ.5 వేల నుంచి, నేటికీ రూ.5వేల 200 నిర్ణీత వేతనంపై పూర్తిస్థాయి పని గంటలు పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్నారని అన్నారు. ఈ వేతనాలతో వారి కుటుంబ పోషణ భారంగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే బతుకులు బాగుపడతాయని, అంటే ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉందని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌లో రూ.19వేలు ఇస్తున్నారని అన్నారు. కానీ తెలంగాణలో అతి గతి లేకుండా పోయిందని అన్నారు. గత 30, 40 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న జిల్లా, మండల పరిషత్ స్కూల్ స్వీపర్లను రెగ్యులర్ చేయాలని అన్నారు. కనీస వేతన మంజూరు చేయాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి, సమాన వేతనం ఇవ్వాలని అన్నారు. అర్హతను బట్టి స్వీపర్ల అందరికి ప్రమోషన్స్ ఇవ్వాలని అన్నారు. ఏవీఎస్‌రెడ్డి హైపవర్ కమిషన్ సిఫారసులను వెంటనే అమలు చేయాలన్నారు. 10వ పీఆర్సీ సిఫారసులు అమలు చేయాలని అన్నారు. లాస్ట్ గ్రేడ్ పేస్కేలు అమలుచేయాలన్నారు. 61సంవత్సరం నుండి రిటైర్డ్ అయిన స్వీపర్లకి రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ సౌకర్యం కల్పించి, పెన్షన్ రూ.10వేల 500 ఇవ్వాలన్నారు. చనిపోయిన స్వీపర్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం అవకాశం కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షులు మమ్మద్ హుస్సేన్, ఉపాధ్యక్షులు డి.బాబు, ప్రధాన కార్యదర్శి సత్తన్న, సహాయ కార్యదర్శి తులసి, గంగన్న, కోశాధికారి లక్ష్మీ నర్సయ్య, సయ్యద్ జమాల్, సయ్యద్ బాబు, మేకల నర్సయ్య, లోలం గంగాధర్, లింగన్న, భూమన్న, గంగన్న, భీమ లింగం, నారాయణ పాల్గొన్నారు.

ఒక టికెట్ మైనార్టీ నాయకుడికి ఇవ్వాలి



నవతెలంగాణ-ఇచ్చోడ

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఒక నియోజకవర్గాన్ని మైనార్టీ వర్గానికి కేటాయించాలని ఇచ్చోడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహమూద్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఒక టికెట్ మైనార్టీ వర్గానికి చెందిన సాజిద్‌ఖాన్‌కు టికెట్ ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధిష్టానాన్ని కోరుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మహమూద్‌ఖాన్ మాట్లాడుతూ ఆదిలాబాద్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షులు సాజిద్‌ఖాన్ తన రాజకీయ భవిష్యత్తును కాంగ్రెస్‌లోనే ప్రారంభించి, నేటి వరకు కాంగ్రెస్ పార్టీకి గత 20 సంవత్సరాలుగా పార్టీ విధేయుడుగా నిస్వార్థంగా సేవ చేస్తూ పార్టీ బలోపేతం చేస్తూన్నారని అన్నారు. గత ఎన్నికల్లో 2014, 2018లో రెండు పర్యాయాలు అదిలాబాద్ అసెంబ్లీ టికెట్ ఆశించిన టికెట్ దొరకకపోవడంతో నిరాశ చెందకుండా పార్టీ గెలుపు కొరకు కృషి చేస్తూ వస్తున్నారని అన్నారు. గత కొన్ని సంవత్సరాల నుంచి డీసీసీ అధ్యక్ష పదవి చేపట్టినప్పటి నుంచి పార్టీ పరిస్థితి జిల్లాలో బలహీనంగా ఉండే అటువంటి సమయంలో ప్రతి మండలాన్ని తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులకు ధైర్యం చెబుతూ నేనున్నానని భరోసా కల్పించారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కళ్లెం నారాయణరెడ్డి, ఎంపీటీసీ జహెద్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎండీ సద్దాం, నియోజకవర్గ మైనార్టీ సెల్ చైర్మెన్ ముస్తఫా, నియోజకవర్గం ఎస్సీ సెల్ చైర్మెన్ కొత్తూరు లక్ష్మణ్, సిరికొండ మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్, బోథ్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మొహమ్మద్, యూత్ అధ్యక్షుడు నౌషాద్, మాజీ ప్యాక్స్ డైరెక్టర్ ముస్తక్, సిరికొండ సీనియర్ నాయకులు మల్లేష్, ఇచ్చోడ సీనియర్ నాయకులు మహబూబ్, ఇచ్చోడ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే బాబా, సిరిచెల్మ నాయకుడు ఇక్బాల్, నాయకులు న్యాజ్, మజీద్‌ఖాన్ పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లను విడుదల చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

పెండింగ్‌లో ఉన్న రూ.5వేల 500 కోట్ల స్కాలర్‌షిప్‌లు, రియింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు సింగరి వెంకటేష్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల ఎదుట సంఘం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనేక పోరాటాల ద్వారా సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి అగమ్య గోచారంగా మారిందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడంలేదని, విద్యార్థుల సంక్షేమాన్ని తుంగలో తొక్కిందని విమర్శించారు. పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులు 16 లక్షల మంది పైగా ప్రభుత్వం చెల్లించే ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లపై ఆధారపడి ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. గత నాలుగు సంవత్సరాలుగా ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను అందించకపోవడంతో అనేకమంది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అనేక కొత్త హామీలనిస్తూ ప్రజలను మభ్యపెడుతుందని అన్నారు. విద్యారంగంలో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించకపోగా ప్రభుత్వమే సంక్షోభంలోకి నేడుతున్నదని దుయ్యబట్టారు. విద్యార్థులకు పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచలేదని అన్నారు. నెలల తరబడి కాస్మొటిక్ చార్జీలు చెల్లించడం లేదని అన్నారు. గురుకులాలలో విద్యార్థులు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, సమస్యల వలయంలో సంక్షేమ హాస్టల్, గురుకుల విద్యార్థులు ఉన్నారని అన్నారు. తక్షణమే తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ విద్యాసంస్థల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, విద్యారంగాన్ని మెరుగుపరచాలని రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు దిగంబర్, మున్నా, నవీన్, రాజేష్, వెంకటేష్, సాయి, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

మంత్రి తలసాని దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ముధోల్

తానూర్ మండల కేంద్రంలో గిరిజన నాయకులు, ఉద్యమకారులు, మంగళవారం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ స్టీల్ బ్రిడ్జ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్, గిరిజన నాయకుడు, ఉమ్మడి ఆదిలాబాద్ తెలంగాణ ఉద్యమకారుడు రాజేష్‌బాబును నెట్టేసి, చెంపదెబ్బ కొట్టడాన్ని ఉద్యమకారులు, గిరిజన నాయకులు తీవ్రంగా ఖండించారు. తెలంగాణ ఉద్యమకారులకు, గిరిజన సమాజానికి వెంటనే మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ క్షమాపణ చెప్పాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. తలసాని ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, ఆయా తండాల గిరిజనులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రభుత్వ హయాంలో మహిళలకు అన్యాయం

- జాన్సన్ నాయక్ ఎస్టీ కాదు
- క్రిస్టియన్‌కు ఎస్టీ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారు
- ఎమ్మెల్యే రేఖానాయక్ మండిపాటు



నవతెలంగాణ-ఖానాపూర్

తెలంగాణ ప్రభుత్వ హయాంలో మహిళ ఎమ్మెల్యే అయినా తనకు తీవ్ర అన్యాయం చేశారని ఎమ్మెల్యే రేఖానాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2009లో తను ఇండిపెండెంట్‌గా పోటీ చేశానని గుర్తు చేశారు. అనంతరం రెండుమార్లు ఎమ్మెల్యేగా ప్రజల ఆశీస్సులతో అండదండలతో ఖానాపూర్ నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలిచానని అయినా తనకు అధిష్టానం అన్యాయం చేసిందని అన్నారు. అయినా ప్రజలే తన దేవుళ్లని ప్రజలపై తనకు నమ్మకం ఉందని అన్నారు. ఎల్లవేళలా ప్రజలతోనే ఉంటానని కచ్చితంగా పోటీ చేస్తానని గెలిచి తీరుతానని ధీమా వ్యక్తం చేశారు. జాన్సన్ నాయక్ ఫోర్ ఫాదర్స్ అందరూ కన్వర్టెడ్ క్రిస్టియన్స్ అని ఎస్టీ కాదని అన్నారు. కన్వర్టెడ్ క్రిస్టియన్ అయినా అతనికి ఎస్టీ సర్టిఫికెట్ ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. తనను నమ్ముకున్న నాయకులు తనతోనే ఉన్నారని వారితో చర్చించి, ఏ పార్టీ నుంచి పోటీ చేసేది అనేది స్పష్టం చేస్తానని అన్నారు. ప్రజలు తనతో ఉన్నారని, ప్రజలతో తాను ఉన్నానని ధీమా వ్యక్తం చేశారు.

భూములకు పట్టాలు ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసుల స్థితిగతులు మార్చేందుకు బేల మండలంలోని సదల్‌పూర్ గ్రామానికి చెందిన రైతులకు భూమి కొనుగోలు పథకం కింద సాగు భూములను ఇవ్వడం జరిగిందని యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్‌రెడ్డి తెలిపారు. ఆ భూములకు సంబంధించి పట్టాలను ప్రభుత్వం వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం బాధిత రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో ఆదివాసీ రైతులకు భూమి కొనుగోలు పథకం కింద ఒక్కొక్కరికి మూడు నుంచి నాలుగు ఎకరాల వరకు పంపిణీ చేసిందని తెలిపారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ భూములకు సంబంధించి పట్టాలు ఇవ్వకపోవడంతో బ్యాంకు రుణం, రైతుబంధు రైతుబీమాకు రైతులు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులకు పట్టాలు అందించి ఆదుకోవాలని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కొడప వాగు, కొడప రామ పటేల్, టేకం లచ్చు, మడవి లక్కు, టేకం రాజు, టేకం పోతు బాయి, టేకం గిరిజబాయి, కొడప కాసుబాయి పాల్గొన్నారు.

27న నిర్వహించే రైతు సదస్సును జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

కనీస మద్దతు ధర చట్టం, దేశ వ్యాప్త రుణమాఫీ ఇతర డిమాండ్ల సాధనకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 27న నిర్మల్‌లో జరిగే జిల్లా సదస్సును జయప్రదం చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర కార్యదర్శి నంది రామయ్య అన్నారు. మంగళవారం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందక, రైతాంగం తీవ్రమైన సంక్షోభంలో కొట్టుమిట్టడుతుందన్నారు. కనీస మద్దతు ధర చట్టం, రుణ మాఫీ, విద్యుత్ సవరణ చట్టం, ఉపసంహారణల సాధనకు ఢిల్లీ కేంద్రంగా 14 నెలల పాటు జరిగిన ఉద్యమ లిఖిత పూర్వక హామీలని మోడీ ప్రభుత్వం తుంగలో తొక్కిందని విమర్శించారు. రైతాంగాన్ని మోసం చేసిందన్నారు. రైతాంగం మరో ఉద్యమానికి సిద్ధం కావాలని అన్నారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో జరిగే సదస్సులో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఏఐకేఎస్ నాయకులు ఎస్ఎన్‌రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్, ఏఐకేఎంఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. రాజు, ఏఐకేఎస్ రాష్ట్ర నాయకులు దేవిదాస్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న, ఏఐటీయూసీ నాయకులు భూక్య రమేష్, పీడీఎస్ యూ జిల్లా అధ్యక్షులు మహేందర్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలి

నవతెలంగాణ-బాసర

బీజేపీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా, కార్యకర్తలు పనిచేయాలని మహారాష్ట్ర నయాగావ్ ఎమ్మెల్యే రాజేష్ సంభాజి పవార్ అన్నారు. మంగళవారం జీఎస్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ప్రవాస్ యోజన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోనే ముథోల్ నియోజకవర్గంలో పార్టీని పటిష్టం చేయాలని సూచించారు. గ్రామాలలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలని అన్నారు. రైతు వేదిక, శ్మశాన వాటికలను కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపట్టినవేనని ఎమ్మెల్యే అన్నారు. అంతకుముందు సరస్వతి అమ్మవారిని ఎమ్మెల్యే రాజేష్ సంభాజి పవార్ దర్శించుకొని పూజలు చేశారు. వీరికి ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో సన్మానం చేసి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు. వీరి వెంట రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవి పాండే, మాజీ సర్పంచ్ సతీష్‌రావు, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్, మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, సుద్ద సాయిబాబ, ముఖేడి శంకర్, నర్సింగ్‌రావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రయివేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యార్థి పరిషత్ రాష్ట్ర ఆర్గనైజేషన్ సెక్రటరీ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు కొట్టూరి ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం డీఐఈఓ రవీందర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎయిడ్స్ వ్యాధిపై విద్యార్థి దశ నుండి అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఐవి నియంత్రణకై కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి రామకృష్ణ తెలిపారు. స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు హెచ్‌ఐవీ నియంత్రణపై నిర్వహించిన క్విజ్ పోటీల్లో గెలుపొందిన వారికి నగదుతో పాటు ప్రశంసపత్రాలు డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్‌తో కలిసి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌమారదశలో విద్యార్థులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థులు లైంగిక వ్యాధుల పట్ల అవగాహన కలిగి ఉండి, హెచ్‌ఐవీ నివారణలో భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్యాం, రాజేష్, తెలంగాణ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ యూత్ కోఆర్డినేటర్ రమేష్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ టికెట్ల కేటాయింపులో బీసీలకు అన్యాయం

నవతెలంగాణ-హాజీపూర్

రాబోవు ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ ప్రకటించిన అభ్యర్థుల జాబితాలో బీసీలకు అన్యాయం జరిగిందని బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60 శాతం ఉన్న బీసీలకు 20 శాతం టికెట్లు, ఐదు శాతం ఉన్న రెడ్లకు 33 శాతం అరశాతం ఉన్న వెలమలకు 16శాతం టికెట్లు కేటాయించి మరొకసారి బీఆర్‌ఎస్ బీసీలకు ద్రోహం చేసిందని తెలిపారు. గతంలో కంటే తక్కువగా 23 టికెట్లు కేటాయించి బీసీలను అవమానించిందని అన్నారు. బీసీల పట్ల కేసీఆర్‌కు చిత్తశుద్ధి లేదనడానికి ఈ జాబితానే నిదర్శనమని అన్నారు. ఈ ఎన్నికల్లో బీసీలు బీఆర్‌ఎస్‌కు బుద్ధి చెప్పాలని పేర్కొన్నారు. రెడ్లకు, వెలమలకు టికెట్ల కేటాయింపుల్లో పెద్దపీట వేసి బీఆర్‌ఎస్ అంటే రెడ్ల వెలమల సమితిగా మారిందని ఆరోపించారు. 115 స్థానాల్లో 65 సీట్లు అగ్రకులాలకు కేటాయించడం బలహీన వర్గాల పట్ల ఉన్న ప్రేమ ఏంటో అర్థమవుతోందన్నారు.

బీఆర్‌ఎస్ ప్రత్యర్థులెవరో..

- 3 నెలల ముందే ఖరారైన అధికారపార్టీ అభ్యర్థులు
- ప్రతిపక్షాల ఎంపిక ప్రక్రియే తరువాయి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

రాబోవు అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దింపేందుకు అధికార బీఆర్‌ఎస్ అభ్యర్థుల ఎంపిక ముగిసింది. మూడు నెలల ముందే సీఎం కేసీఆర్ తన పార్టీ అభ్యర్థులను ప్రకటించడమే కాకుండా తక్షణమే తమ తమ నియోజకవర్గాలలో అభ్యర్థులు ప్రచారం ప్రారంభించాలని ఆదేశించారు. దీనితో జిల్లాలలో ఎన్నికల సందడి ప్రారంభమైంది. అన్ని పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించి, ప్రచారంలో ముందుండాలనే అధిష్టానం సూచనల మేరకు నియోజకవర్గాలలో ఇప్పటి నుండే అభ్యర్థులు ప్రచారం ప్రారంభిస్తున్నారు. ఇక మిగిలిందల్లా అధికారపార్టీ అభ్యర్థులకు ప్రత్యర్థులెవరనే విషయమే. సహజంగా అధికారపార్టీ నుండి పోటీ చేసే ఆశావహులు అధికంగా ఉంటారు. అభ్యర్థులను ఎంపిక చేయడంలో ఆ పార్టీ అచితూచి వ్యవహరిస్తుంది. ప్రతీ నియోజకవర్గం నుండి ఆశావహులున్నా ఆ సమస్యను అధిగమించి బీఆర్‌ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. ప్రతిపక్ష పార్టీల నుండి కూడా పోటీ చేసేందుకు ఆయా నియోజకవర్గాలలో అశావహులు అధికంగానే ఉన్నారు. అధికారపార్టీ అభ్యర్థులు ఖరారైనందున ఆయా నియోజకవర్గాలలో ఆ అభ్యర్థులకు గట్టి పోటీ ఇచ్చే వారిని ఎంపిక చేసేందుకు ప్రతిపక్ష పార్టీలు పావులు కదుపుతున్నాయి. మంచిర్యాల, కుంరంభీం ఆసిఫాబాద్ జిల్లాలలో ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా, ఈ నియోజకవర్గాలలో ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ, బీఎస్‌పీ, సీపీఐ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఆయా పార్టీలు సన్నద్ధమవుతున్నాయి.

సిర్పూరు (టి)లో బీజేపీ, కాంగ్రెస్‌లోనే ఆశావహులు

సిర్పూరు (టి) నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పనే ప్రకటించారు. అందరూ ఊహించిన విధంగానే ఆయన అభ్యర్థిత్వమే ఖరారైంది. ఇక బీజేపీ నుండి ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గసభ్యుడు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు పోటీ పడుతున్నారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ నుండి పోటీ చేసిన పాల్వాయి హరీష్‌బాబు బీఆర్‌ఎస్ అభ్యర్థి కోనప్పకు గట్టి పోటీ ఇచ్చారు. తర్వాత బీజేపీలో చేరిన హరీష్‌బాబు తనకే టిక్కెట్ వస్తుందనే ధీమాతో నియోజకవర్గంలో ప్రచారం చేపడుతున్నారు. కాంగ్రెస్ నుండి కోరళ్ల కృష్ణారెడ్డి, రావి శ్రీనివాస్‌లు పోటీ పడుతున్నారు. ప్రేంసాగర్‌రావు వర్గం నుండి కృష్ణారెడ్డి, డీసీసీ అధ్యక్షులు విశ్వప్రసాద్‌రావు వర్గం నుండి రావి శ్రీనివాస్‌లు టిక్కెట్ కోసం తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. బీఎస్‌పీ నుండి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఇప్పటికే తాను సిర్పూరు నుండి పోటీ చేస్తున్నట్లు ప్రకటించడమే కాకుండా నెలలో 15 రోజులు ఇక్కడే ఉంటూ ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు.

ఆసిఫాబాద్ కాంగ్రెస్‌లో అయోమయం

ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో అయోమయం నెలకొంది. జడ్పీ ఛైర్‌పర్సన్ కోవ లక్ష్మికి బీఆర్‌ఎస్ టిక్కెట్ కేటాయించారు. కాంగ్రెస్ నుంచి ఇప్పటికే ఎం సరస్వతి, గణేష్‌రాథోడ్ పోటీ పడుతుండగా, తాజా పరిణామాల నేపథ్యంలో మాజీ టీఎన్‌జీఓ అధ్యక్షుడు శ్యాంనాయక్ రెండు రోజుల క్రితం కాంగ్రెస్‌లో చేరడంతో పాటు ఈ నియోజకవర్గ కాంగ్రెస్ టిక్కెట్ కోసం దరఖాస్తు కూడా చేసుకున్నారు. దీనితో ఇక్కడ కాంగ్రెస్ టిక్కెట్ కోసం త్రిముఖ పోటీ నెలకొంది. శేషారావు కూడా కాంగ్రెస్ టిక్కెట్ రేసులో ఉన్నారు. బీజేపీ నుండి ఆత్మారాం నాయక్ పోటీలో ఉండే అవకాశాలు ఉన్నాయి.

బెల్లంపల్లిలో గట్టి పోటీకి అవకాశాలు

బెల్లంపల్లి నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకే బీఆర్‌ఎస్ టిక్కెట్ కేటాయించింది. వామపక్షాల కంచుకోట అయిన ఈ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీతో పాటు సీపీఐ కూడా బరిలో ఉంటుంది. బీఆర్‌ఎస్-వామపక్షాల పొత్తులో ఈ స్థానం సీపీఐకి కేటాయిస్తారని వామపక్షాలు భావించాయి. కాని బీఆర్‌ఎస్ అభ్యర్థిని ప్రకటించడంతో ఇక్కడ సీపీఐ అభ్యర్థిగా ఆర్ చంద్రశేఖర్ బరిలో ఉండే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికే ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. ఇక కాంగ్రెస్ నుండి ఐదారుగురు ఆశావహులు ఉన్నా మాజీ మంత్రి గడ్డం వినోద్‌కే ఎక్కువ అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడ వినోద్‌తో పాటు నాతరి స్వామి, చిలుముల శంకర్, రొడ్డ శారద, ముడిమడుగుల మహేందర్, వేముల కృష్ణ, దుర్గాభవానీలు కాంగ్రెస్ టిక్కెట్ ఆశిస్తున్నారు. బీజేపీ నుండి మాజీ ఎమ్మెల్యే ఎ శ్రీదేవితో పాటు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కొయ్యల హేమాజి టిక్కెట్ రేసులో ఉన్నారు.

మంచిర్యాలలో రసవత్తర పోరుకు అవకాశాలు

జనరల్ స్థానమైన మంచిర్యాల నియోజకవర్గంలో రసవత్తర పోరుకు అవకాశాలు ఉన్నాయి. ఇక్కడ సీపీఐ, బీఎస్‌పీ మినహా మిగిలిన పార్టీల నుండి అగ్రవర్ణాలకు చెందిన అభ్యర్థులే ఆశావహులుగా ఉన్నారు. బీఆర్‌ఎస్ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే దివాకర్‌రావుకు టిక్కెట్ కేటాయించగా, కాంగ్రెస్ నుండి మాజీ ఎమ్మెల్సీ ప్రేంసాగర్‌రావే పోటీలో ఉంటున్నారు. బీజేపీ నుండి ఆపార్టీ జిల్లా అధ్యక్షులు రఘునాథ్‌రావు బరిలో ఉండే అవకాశాలు ఉన్నాయి. సీపీఐ నుండి కలవేన శంకర్, బీఎస్‌పీ నుండి దొమ్మటి అర్జున్ అలియాస్ నాగరాజు బరిలో ఉంటున్నట్లు తెలుస్తోంది.

చెన్నూరులో అయోమయం

చెన్నూరు నియోజకవర్గంలో ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులు ఎవరనే విషయంలో అయోమయం నెలకొంది. ఈ నియోజకవర్గంలో రాజకీయంగా మొదటి నుండి బలంగా ఉన్న కాంగ్రెస్ నాయకుడు వెంకటస్వామి కుమారులు వివేక్, వినోద్‌లు రెండుగా చీలిపోయి ఒకరు కాంగ్రెస్‌లో, ఒకరు బీజేపీలో ఉన్నారు. బీజేపీ నుండి వివేక్ బరిలో ఉంటాడని భావిస్తున్నా, గత కొంతకాలంగా ఆయన పార్టీవైఖరి పట్ల అసంతృప్తితో ఉన్నట్లు పత్రికలలో కథనాలు వచ్చాయి. కాంగ్రెస్ నుండి నూకల రమేష్, డాక్టర్ రాజా రమేష్‌బాబు, రామిళ్ల రాధికలు ప్రస్తుతం పోటీలో ఉన్నారు. చివరి నిమిషంలో వివేక్ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరి టిక్కెట్ తెచ్చుకుంటారనే చర్చ కూడా నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. అధికారపార్టీ నుండి సిట్టింగ్ ఎమ్మెల్యే బాల్క సుమన్ బరిలో ఉన్న విషయం తెల్సిందే.

పేద కుటుంబాలకు నిత్యవసర సరుకుల పంపిణీ



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని రెండో వార్డులో మీజాన్ కిరాణం అండ్ జనరల్ స్టోర్ దుకాణం మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఆ దుకాణం యజమాని పాషా 10 మంది నిరుపేద కుటుంబాలకు బియ్యం, నిత్యవసర సరుకులు మందమర్రి పట్టణ సీఐ మహేందర్ రెడ్డి, స్థానిక ఎస్సై బి.అశోక్, పట్టణ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు అబ్దుల్ ఆజీజ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ మన చుట్టు ప్రక్కల ఉన్నటువంటి నిరుపేదలకు సహాయం చేయడం గొప్ప విషయమని కొనియాడారు. నిత్యవసర వస్తువులు తీసుకున్న నిరుపేద కుటుంబాలు పాషా కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండో వార్డ్ కౌన్సిలర్ పుల్లూరి సుధాకర్, బిలాల్ మస్జీద్ ఇమామ్ అబ్దుల్ ఆజీజ్, దేవేందర్, రాజు, గౌస్ పాషా పాల్గొన్నారు.

టిక్కెట్‌ల కేటాయింపులో బీసీలకు అన్యాయం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

బీఆర్‌ఎస్ టిక్కెట్‌ల కేటాయింపులో బీసీలకు అన్యాయం జరిగిందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గసభ్యులు గోలెం వెంకటేష్ విమర్శించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు కేవలం 20 శాతం టిక్కెట్‌లు ఇచ్చి, ఐదు శాతం ఉన్న రెడ్లకు 33 శాతం, అరశాతం ఉన్న వెలమలకు 16 శాతం టిక్కెట్‌లు కేటాయించారని అన్నారు. బీసీ ద్రోహి పార్టీగా బీఆర్‌ఎస్ నిరూపించుకుందని అన్నారు. బీసీల పట్ల ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదనడానికి టిక్కెట్‌ల కేటాయింపే నిదర్శనమని అన్నారు. రాబోయే ఎన్నికలలో బీసీలు ఆ పార్టీకి బుద్ధి చెప్పాలని కోరారు.

ఆర్కే-5 గని 'సిక్కా' ఫిట్ రిప్రెజెంటేటివ్‌గా వేల్పుల మధునయ్య



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి కాలరీస్ క్లర్క్ అసోసియేషన్(సిక్క) ఆర్కే-5 గని రిప్రెజెంటేటివ్‌గా డిప్యూటీ సూపరింటెండెంట్ వేల్పుల మధునయ్య ఎన్నిక అయినట్లు ఆ సోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ కన్నం సాంబయ్య పేర్కొన్నారు. అలాగే అసిస్టెంట్ రిప్రెజెంటేటివ్‌గా సీనియర్ అసిస్టెంట్ రాంపల్లి శ్రీకాంత్, ఏరియా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా సుద్దుల సురేష్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమానికి కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ముస్కె సమ్మయ్య, కార్యదర్శి శ్రీధర్ పాల్గొని మాట్లాడారు. శ్రీరాంపూర్ ఏరియాలో మినిస్ట్రీయల్ స్టాఫ్‌కు సరి అయిన మౌలిక సదుపాయాలు లేవని, దశాబ్దాల కాలం క్రితం సమకూర్చిన టేబులు, బీరువాలు కుర్చీలు, సిస్టమ్స్ ఉన్నాయన్నారు. అందువల్ల స్టాఫ్ చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, గతంలో జీఎం కార్యాలయంలో కూడా ఇబ్బందులు ఉండేవని, ప్రస్తుతం యాజమాన్యం సమస్యను పరిష్కరించారని, కానీ అండర్ గ్రౌండ్ గనులలో ఇంకా పాతకాలం సామాగ్రి ఉందని పేర్కొన్నారు. మౌలిక సదుపాయాలను సమకూర్చాలని కోరారు. అందులో భాగంగానే ఆర్కే 5 గనిలో సమస్యను పరిష్కరించాలని గని మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సిక్కా నాయకులు రవి, బుచ్చయ్య, లక్ష్మీపతి, గౌస్, పోషం పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం మండలంలోని 50 మందికి కళ్యాణలక్ష్మి, షాదీముభారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎంపీపీ విమలాబాయి, జడ్పీటీసీ అజయ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం నిరుపేదలకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడినప్పటీ నుంచి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రహిమొద్దీన్, సర్పంచ్‌లు బండె తుకారాం, దేవ్‌రావు, అయూబ్, సింగిల్‌విండో ఛైర్మన్ జాబిరె పెంటు పాల్గొన్నారు.

ఘనంగా జడ్పీటీసీ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-వాంకిడి

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు మంగళవారం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేయడంతో పాటు డెయిలీ క్రికెట్ యూత్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఉప్రె వినయ్ పాల్గొన్నారు.

ఏరియర్స్ ఆగస్టు వేతనంతో చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

11వ వేజ్ బోర్డ్ 23 నెలల ఏరియర్స్ మొత్తాన్ని ఆగస్టు నెల జీతంతో ఒకే దఫా చెల్లించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి, వేజ్ బోర్డు శాశ్వత సభ్యుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. ఆర్కే-7 గనిలో నిర్వహించిన గేట్ మీటింగ్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏరియల్ డబ్బులు ఒకే దఫాలో చెల్లించాలని, లేని పక్షంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ నెల 25, 26, 27 తేదీలలో గోదావరిఖనిలో జరుగు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ 16వ రాష్ట్ర మహాసభలను సింగరేణి కార్మికులు అధిక సంఖ్యలో హాజరై ఈ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అదేవిధంగా సింగరేణి కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు, నూతన హక్కుల సాధన కోసం ఈ యొక్క మహాసభలలో భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవడం జరుగుతుందని, కాబట్టి యావత్ సింగరేణి కార్మిక వర్గం హాజరై మహాసభలను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె వీరభద్రయ్య, సెంట్రల్ కార్యదర్శి ముస్కే సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా, బ్రాంచ్ ఉపాధ్యక్షులు కొట్టే కిషన్ రావు, ఏరియా కార్యదర్శి మారపల్లి సారయ్య, ఫిట్ కార్యదర్శి రవీందర్, ఆకుల లక్ష్మణ్, ప్రతాప్, మైనింగ్ స్టాఫ్ మారపల్లి బాపు, చంద్రశేఖర్, ట్రేడ్స్ మెన్స్ తిరుపతి, కాంట్రాక్టు కార్మిక సంఘం బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

మార్పు దహెగాం నుండే ప్రారంభం కావాలి

నవతెలంగాణ-దహెగాం

తెలంగాణ రాష్ట్రంలో రాజకీయ మార్పు దహెగాం మండలం నుండే ప్రారంభం కావాలని మహారాష్ట్ర షామూర్ ఎమ్మెల్యే సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కీర్తికుమార్ బంటి బంగిడియా అన్నారు. మంగళవారం మండలకేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అంతకుముందు మండలకేంద్రానికి వచ్చిన ఆయనను జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీష్‌బాబు ఆధ్వర్యంలో స్వాగతం పలికి ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలకు పూలమాలలు వేసిన అనంతరం పార్టీ మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్ బీజేపీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో ప్రతి ఒక్కరు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలన్నారు. గత 15 సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అధికారంలో ఉన్నప్పటికీ నియోజకవర్గంలో అభివృద్ధి ఎక్కడా వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. వరుసలో నెంబర్‌వన్ నియోజకవర్గంగా ఉన్న సిర్పూర్ అభివృద్ధి విషయంలో చిట్టచివరి స్థానంలో ఉందని విమర్శించారు. ఒక్క బీజేపీ కార్యకర్త 10 ఓట్లు వేయిస్తే బీజేపీ విజయం సునాయాసమవుతుందన్నారు. నియోజకవర్గానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేటాయించింది శూన్యమని, కేంద్ర ప్రభుత్వ నిధులనే రాష్ట్ర ప్రభుత్వ నిధులుగా చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మరో 90 రోజులు ప్రతి కార్యకర్త గట్టి ప్రయత్నం చేస్తే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీష్‌బాబు, కొంగ సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు కోంద్ర తిరుపతిగౌడ్, మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ్, నాయకులు గోలెం వెంకటేష్, వీరభద్రాచారి, చపిడె సత్యనారాయణ, పుప్పాల సత్యనారాయణ, పుల్గం సత్యనారాయణ, దామోధర్, ప్రభాకర్‌గౌడ్, తుమ్మె సురేష్, చపిడె సంజీవ్, రాపర్తి జయలక్ష్మి, ఎలుకరి సంజీవ్ పాల్గొన్నారు.



నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగుల మద్దతు కోరిన ఏఎన్‌ఎంలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో గత ఆరు రోజులుగా సమ్మె చేస్తున్న రెండవ ఏఎంఎంలు ఏడవ రోజు తమ సమ్మెకు మద్దతు ఇవ్వాలంటు నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను కలిసి జిల్లా అధ్యక్షుడు దివాకర్ ఆధ్వర్యంలో అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యంగా ఉన్నప్పుడే సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. రెండవ ఏఎన్‌ఎంల సమ్మెకు మద్దతు ఇవ్వాలని వారి సమస్యల పరిష్కారం కోసం వారితో కలిసి రావాలని కోరారు. రెండవ ఏఎన్‌ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, జూలై 26న ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు సంతోషి, నాయకులు సునీత పాల్గొన్నారు.

మన ఊరు-మన బడి పనుల పరిశీలన



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

మన ఊరు-మన బడి పనులను త్వరగా పూర్తిచేయాలని పంచాయతీ రాజ్ ఏఈ మగ్బుల్ అన్నారు. మంగళవారం మండలంలోని ఎలుకపెల్లి, సంజీవనగర్, పెంచికల్‌పేట్ ఇంగ్లీష్ పాఠశాలల్లో పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను వంద శాతం పూర్తిచేయాలని గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఆజ్మేర పాండు, ప్రధానోపాధ్యాయులు భాగ్యలక్ష్మి, ప్రియాంక, హర్షియా పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

విద్యార్థులు లక్ష్యసాధనకు కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రూప్నర్ రమేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో డిపో మేనేజర్ శ్రీధర్‌తో కలిసి విద్యార్థులకు 200 ఉచిత బస్ పాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధతో చదివి ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు. ప్రతి విద్యార్థి విద్యతో పాటు సామాజిక సేవలో పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఆవిడపు ప్రణయ్ కుమార్, మాలి సంఘం జిల్లా అధ్యక్షుడు నగేషే శంకర్ పటేల్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రచార కార్యదర్శి మిట్ట తిరుపతి, యువజన సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మారుతి, డివిజన్ అధ్యక్షుడు బొట్టుపల్లి ప్రశాంత్, మండల అధ్యక్షుడు సిరికొండ సాయికృష్ణ, గడ్డల చిరంజీవి పాల్గొన్నారు.

హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్‌గా పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించి, హైపవర్ కమిటీ వేతనాలు చెల్లించాలని సింగరేణి ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్స్ డిమాండ్ చేశారు. మంగళవారం నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్ క్లబ్ నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి సంస్థ అభివృద్ధిలో ఆస్తిని పరిరక్షించడంలో పర్మనెంట్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వహిస్తున్నామని, కానీ సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సింగరేణి లాభాల్లో కూడా వాటా ఇవ్వకుండా, కనీసం జీఓ 22ను గెజిట్ చేసి వేతనాలు అమలు పరచాలని కోరారు. గతంలో ముఖ్యమంత్రి శ్రీరాంపూర్ ఏరియాకు వచ్చినప్పుడు కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేస్తామని చెప్పి మాట తప్పారని గుర్తు చేశారు. ఇంతకుముందు సీఎంపీఎఫ్ చిట్టీలు ఇచ్చేవారని, ఇప్పుడు అవి కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. అంతేకాకుండా సింగరేణి హాస్పిటల్‌లో వైద్య సేవల నిమిత్తం అవకాశం కల్పించినప్పటికీ సరైన వైద్యం అందడం లేదని పేర్కొన్నారు. సింగరేణి హాస్పిటల్‌లో కుటుంబ సభ్యులకు కూడా వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇప్పుడున్న ధరల దృశ్య వేతనాల పెంపుకు కృషి చేయాలని సింగరేణి సంస్థ, ప్రజా ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో ప్రయివేట్ సెక్యూరిటీ గార్డ్స్ సంపత్, శ్రీనివాస్, రాజేశం, స్వామి, బాపు, మధునయ్య, వెంకటేష్, నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల సంబరాలు



నవతెలంగాణ - బెజ్జూర్

సిర్పూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఆ పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించటంతో మంగళవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు సంబరాలు జరుపుకున్నారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. మూడోసారి ఎమ్మెల్యేగా కోనేరు కోనప్ప హ్యాట్రిక్ విజయం సాధిస్తారని జడ్పీటీసీ పుష్పలత, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సకారాం అన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యేగా తిరిగి కోనేరు కోనప్ప ఎన్నికవుతారని, 50 వేల మెజార్టీతో కోనప్ప విజయం ఖాయమన్నారు. సిర్పూర్ అభ్యర్థిగా కోనప్పను ప్రకటించినందుకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావుకు పార్టీ నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. సంబరాల్లో కోఆప్షన్ సభ్యుడు బషరత్‌ఖాన్, బీఆర్‌ఎస్ నాయకులు డోకె వెంకన్న, బుజాడీ శేఖర్, ఇస్తారి, తంగెడిపెల్లి మహేష్, కోంద్ర నరేందర్‌గౌడ్, జావీద్ అలీ, జావీద్ హుస్సేన్, రంగు సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఆ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

నవతెలంగాణ-రెబ్బెన

ఎన్ఎహెచ్ఎం స్కీమ్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూ ఆధ్వర్యంలో మండలకేంద్రంలోని సీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ సుజిత్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగె ఉపేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్ మాట్లాడుతూ ఎన్‌హెచ్ఎం స్కీంలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని కోరుతూ ఈ నెల 31వ తేదీన నిర్వహించ తలపెట్టిన నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గత 20 సంవత్సరాల నుండి 16 వేల మంది ఎన్‌హెచ్ఎం స్కీంలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో చాలీచాలని వేతనాలు తీసుకుంటూ కుటుంబ పోషణ కష్టమైనప్పటికీ ప్రజల ఆరోగ్యం కాపాడడంలో అత్యంత కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. ఎన్‌హెచ్ఎం ఉద్యోగులందరిని ఎలాంటి శరతులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. అలాగే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం రవీందర్, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు జాన్సీ, వనిత, మృదుల్ మండల్ పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
4
బుధవారం 23 ఆగస్టు 2023

హత్య కేసులో నలుగురికి జైలు శిక్ష

నవతెలంగాణ-సారంగాపూర్

హత్యకేసులో నలుగురికి జీవితకాల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి రెండువేల రూపాయల జరిమాన విధిస్తూ, మంగళవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి కర్ణ కుమార్ తీర్పు వెలువరించినట్టు ఎస్సై కృష్ణా సాగర్‌రెడ్డి తెలిపారు. మండలంలో జామ్ గ్రామంలో భూతగాదాల విషయంలో 2017లో దర్యనం రవీందర్ అలియాస్ (రవి) అనే యువకుడిని అదే గ్రామానికి చెందిన నలుగురు గడ్డల నరేష్, రౌతు పోశెట్టి, కొవ్వ గంగయ్య, పాల కిషన్ అనే నలుగురు వ్యక్తులు హత్య చేశారు. మంగళవారం పోలీసులు నేరస్తులను న్యాయస్థానంలో ప్రవేశపెట్టి 19 మంది సాక్షులతో నేరం రుజువు కావడంతో శిక్ష విధించినట్టు పేర్కొన్నారు.

పురుగులమందు తాగి యువకుడి ఆత్మహత్య

నవతెలంగాణ-తలమడుగు

పురుగుమందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన ఆత్రం సత్యనారాయణ(29) మంగళవారం పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు సత్యనారాయణ గత సంవత్సరం నుంచి మద్యానికి బానిసై ఆర్థిక సమస్యలు ఎదురు కావడంతో తన చేనులో సాయంత్రం పురుగులమందు తాగి కుటుంబ సభ్యులు గమనించి, వెంటనే రిమ్స్‌కు తరలించారు. రిమ్స్‌లో చికిత్స పొందుతూ భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై సురేందర్ తెలిపారు.

ఆదిలాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాల మంజూరు

- సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే కృతజ్ఞతలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు అనుమతిని ఇస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఐటీ కార్యకలాపాల విస్తరణ, రూ.40 కోట్ల వ్యయంతో ఐటీ టవర్ నిర్మాణం చేపడుతున్న వేళ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుతో జిల్లా చరిత్రలోనే నూతన శకం ప్రారంభం కానుందని అన్నారు. మంగళవారం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆదిలాబాద్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపడం పట్ల ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల జిల్లా కేంద్రంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసి, ఈ విద్యా సంవత్సరం నుంచి తరగతులను సైతం ప్రారంభించే దిశగా సన్నాహాలు చేస్తోందని అన్నారు. తాజాగా ఇంజనీరింగ్ కళాశాలకు సైతం అనుమతులు ఇవ్వడంతో సాంకేతిక విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థుల ఇకపై ఇక్కట్లు తీరనున్నాయి. ఇంజనీరింగ్ చదవడానికి హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లే అవసరం లేకుండా స్థానికంగానే నాణ్యమైన విద్య లభించనుందని అన్నారు. ఇక ప్రభుత్వం ద్వితీయ శ్రేణి నగరాలకు ఐటీ కార్యకలాపాలను విస్తరించడంతో పట్టణంలో ఇప్పటికే ఐటీ సేవలు ప్రారంభమయ్యాయి. నలభై కోట్ల వ్యయంతో ఐటీ టవర్ నిర్మాణాన్ని సైతం చేపడుతున్నారు. అటు ఆదిలాబాద్‌కు ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేయడం పట్ల ఎమ్మెల్యే జోగురామన్న సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయమై సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన ఆయన. విద్యార్థుల సౌలభ్యం కోసం ప్రభుత్వం కళాశాలల ఏర్పాటుకు ముందుకు వస్తోందని తెలిపారు. వ్యవసాయ కళాశాలతో పాటు ఇంజనీరింగ్ కళాశాల ఏర్పడితే స్థానికంగానే నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటికే ఐటీ కార్యకలాపాలు ప్రారంభమైన నేపథ్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలు లభిస్తున్నాయని, భవిష్యత్తులో ఐటీ టవర్ నిర్మాణం పూర్తయితే మరిన్ని ఉద్యోగాలు వస్తాయని అన్నారు.

ఇంజనీరింగ్ కళాశాల మంజూరు పట్ల సంబురాలు...

ఆదిలాబాద్ పట్టణంలో జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేయడంతో సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఈ మేరకు బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలో సంబురాలు నిర్వహించారు. సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్నల ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ఒకరికొకరు మిటాయిలు తినిపించుకుని సంబురాలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ అధ్యక్షులు శివకుమార్



మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధిని చేసి చూపుతున్న ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కిందని అన్నారు. తాజాగా ఇంజనీరింగ్ కళాశాలను మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. కళాశాల ఏర్పాటుకు కృషి చేసిన సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్నలకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహాకల్ అజయ్, ఇమ్రాన్, ఇబ్బు, అభిలాష్, అఖిల్, సలీం, రఘు పాల్గొన్నారు.

పార్టీ అధిష్టానానికి కట్టుబడి ఉంటాం



నవతెలంగాణ-ఉట్నూర్

బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉంటామని ఎంపీపీ పంద్రా జైవంత్‌రావ్, పార్టీ మండలాధ్యక్షుడు కందుకూరి రమేష్ అన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పార్టీ అధ్యక్షులు, సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయానికి నాయకులు, కార్యకర్తలు కట్టుబడి ఉంటారని అన్నారు. రానున్న ఎన్నికల కోసం సీఎం ప్రకటించిన ఖానాపూర్ నియోజకవర్గ అభ్యర్థి జాన్సన్ నాయక్ వెంబడి ఉండి గెలుపు కోసం కృషి చేస్తామని అన్నారు. రాష్ట్రంలో మూడోసారి సీఎం కేసీఆర్ అధికారం చేపడతారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజాభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్న ప్రభుత్వాన్ని ప్రజలే ఎన్నుకుంటారని అన్నారు. ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్, సైతం పార్టీ విడకుండా పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. బీఆర్ఎస్ నాయకులు ఎవరైనా పార్టీకి వ్యతిరేకంగా వ్యవహరిస్తే చర్యలు ఉంటాయని అన్నారు. దశాబ్ద కాలంగా పార్టీ కార్యక్రమాలలో పాల్గొన్న కార్యకర్తలు, నాయకులకు రాబోయే రోజుల్లో మంచి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మెన్ ఎస్పీ రెడ్డితో పాటు కోఆప్షన్ సభ్యుడు రషీద్, నాయకులు ప్రభాకర్, రమేష్, ముజీబ్ ఖాన్, బాధిరావు, భరత్, ఆశన్న, నందకుమార్, అన్నారి ఉన్నారు.

ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ

- రామన్నను కలిసిన బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదిలాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎమ్మెల్యే జోగు రామన్నకే టికెట్ కేటాయించగా, పార్టీ శ్రేణులు, నాయకులు, అభిమానులు ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. వరసగా ఐదవ సారి ఎన్నికల్లో ఘన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేను శాలువా, పూలమాలలతో సత్కరించారు. బోథ్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాదవ్ అనిల్, ఎమ్మెల్యే జోగు రామన్నను తన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు. అదేవిధంగా స్వచ్ఛంద సంస్థలు బీఆర్ఎస్ పార్టీ నాయకులు అభిమానులతో పాటు సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలోనూ ఎమ్మెల్యే జోగు రామన్నను కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎమ్మెల్యే మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని స్పష్టం చేశారు.

సైన్స్ డిగ్రీ కళాశాలకు పీజీ ర్యాంకుల పంట

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పీజీ ప్రవేశ పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. ఈ ఫలితాల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సైన్సెస్ ఆదిలాబాద్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, మంచి ర్యాంకులు సాధించారు. ఖడ్సే విష్ణుప్రియ హిందీలో 10 ర్యాంకు, గణితంలో 29వ ర్యాంకు, కందుకూరి సాహితి భౌతిక శాస్త్రంలో 62 ర్యాంకు, కంప్యూటర్ సైన్స్‌లో 205 ర్యాంకు, సిరిపురే శ్రద్ధ రసాయన శాస్త్రంలో 262 ర్యాంకు, గాజుల ప్రత్యూష గణితంలో 308 ర్యాంకు, పిట్ల అపర్ణ గణితంలో 788వ ర్యాంకు, ప్రియాంక గణితంలో 1298 ర్యాంకు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ జగ్‌రామ్ అంతర్వేది అధ్యాపకులు ప్రతాప్‌సింగ్, రమేష్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, జాకీర్ హుస్సేన్, తిరుపతి, రఘునాథ్, సాయి ప్రసాద్, జ్యోత్స్న, సంతోష్ కుమార్ నర్సింగరావు, దయాకర్, శ్రీనివాస్ విజయ్ కుమార్, అశ్రాఫ్ అలీ అభినందించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని ఆకాంక్షించారు.

స్టేట్ 1స్ట్ ర్యాంక్ సాధించిన విద్యార్థి..

పీజీ ప్రవేశ ఫలితాలు మంగళవారం విడుదలయ్యాయి. కాగా ఆదిలాబాద్ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు తమ సత్తాను చాటారు. ఈ సందర్భంగా బీఏ విద్యార్థిని ముండే రూమతాయి ఏంఏ హిస్టరీలో రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఎంఏ పొలిటికల్ సైన్స్‌లో 59వ ర్యాంకును సాధించింది. అలాగే ఏంఏ ఇంగ్లీషులో 179వ ర్యాంక్ మూడు ర్యాంకులు సాధించింది. దీంతో కళాశాల ప్రిన్సిపాల్ అనితతో పాటు పలువురు అభినందించారు.

కొన్న సాగుతున్న గృహలక్ష్మి సర్వే

నవతెలంగాణ-నార్నూర్

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకంలో భాగంగా ముమ్మరంగా సర్వే కొనసాగుతోందని అన్నారు. మంగళవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ముక్తాపూర్, బీసీ వాడలో తిరిగి కార్యదర్శి కొల శేఖర్ సర్వే నిర్వహించారు. సర్వేకు గృహలక్ష్మి పథకంలో భాగంగా ధరఖాస్తు చేసుకున్న ధరఖాస్తుదారులు ఇంట్లో ఉండి సహకరించాలని కోరారు. వారి వెంట ఉప సర్పంచ్ విష్ణు ఫడ్ దరఖాస్తుదారులు ఉన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

హైదరాబాద్‌లో సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశాలు సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్నాయి. ఈ సమావేశంలో సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు బొజ్జ ఆశన్న పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీ కార్మికులు సమ్మె చేసినా వారిపట్ల ఈ రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచిన తర్వాత హామీలు అమలు చేయకుండా కూడా వీరి పట్ల మొండిగా వ్యవహరిస్తుందన్నారు. గ్రామపంచాయతీ కార్మికులు న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. గతంలో ఐకేపీ వీఓఏలు కూడా సమ్మె చేశారని మంత్రి హామీనిస్తే సమ్మె విరమించారన్నారు. నెలలు గడుస్తున్న డిమాండ్లకు పరిష్కారం చేయలేదని అన్నారు. ఈ వర్కింగ్ కమిటీ సమావేశంలో అదిలాబాద్ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ఉన్నారు.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటు హక్కును ప్రతిఒక్కరూ వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వయోవృద్ధులకు 'నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను' అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు కీలకమైనదని, ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఓటరు తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనాలని అన్నారు. ఓటర్ల సౌకర్యార్థం ఎన్నికల సంఘం ఎప్పటికప్పుడు అనేక మార్పులు చేపడుతూ, వివిధ రకాల సదుపాయాలను అందుబాటులోకి తెస్తోందని తెలిపారు. ఇందులో భాగంగా సీక్రెట్ బ్యాలెట్ విధానాన్ని అనుసరిస్తూ, ఎనభై ఏండ్లు పైబడిన వయోవృద్ధులు, దివ్యాంగులు తమ ఇంటి నుండే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటును కల్పించిందని వివరించారు. ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని, వయోవృద్ధులు ఓటింగ్ ప్రక్రియపై పూర్తి అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే ప్రతి పోలింగ్ కేంద్రంలో ర్యాంప్, వీల్ చైర్, తాగునీరు, మరుగుదొడ్లు వంటి ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరుపై అనుమానాలను నివృత్తి చేస్తూ, పూర్తి అవగాహన కల్పించేందుకు వీలుగా కలెక్టరేట్, ఇతర కార్యాలయాల్లో నమూనా కేంద్రాలను నెలకొల్పడం జరిగిందన్నారు. అనంతరం నేను ఖచ్చితంగా ఓటు వేస్తాను అని కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరుచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పలువురు వయోవృద్ధులను కలెక్టర్, అదనపు కలెక్టర్ శాలువాతో సన్మానించారు. అనంతరం నిర్వహించిన నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్, అదనపు కలెక్టర్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, స్వీప్ నోడల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా సంక్షేమ అధికారిణి మిల్కా, వయోవృద్ధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఏఎన్ఎంలపై వివక్ష తగదు

- ఏఎన్ఏంల సమ్మెకు డీఎస్పీ మద్దతు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమస్యల పరిష్కారంలో వివక్ష చూపుతోందని రెండో ఏఎన్ఎం లను వెంటనే వారిని రెగ్యులర్ చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గణేష్ మహారాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రమాదకరమైన విపత్తు కరోనా లాంటి వ్యాధులు ప్రబలినప్పుడు కూడా సమర్థవంతంగా ప్రాణాలకు తెగించి రోగులకు సేవలందించారని అన్నారు. రాజకీయ పాలక పదవులు పొందుతున్న పాలకులు సీఎం కేసీఆర్, ఏఎన్ఎంల రెగ్యులర్ చేయకపోవడం దారుణం అన్నారు. ప్రభుత్వం ఏఎన్ఎంల ఉద్యోగాల కోసం ఇచ్చిన నోటిఫికేషన్ రద్దు చేయాలని, ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్న ఏఎన్ఎంలను వారి సీనియార్టీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలు ప్రజాసంఘాలు నాయకులను వివిధ సంఘాలను కలుపుకొని ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ పార్టీ జిల్లా నాయకులు ఎల్మల మంజూష, బరుకుంటి రాజీవ్, దుమ్మ తిరుపతి, అగ్గిమల్ల గంగన్న, రాజేందర్, వేణు కుమార్, రాకేష్, సుధాకర్ నర్సయ్య ఉన్నారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లు రాష్ట్రానికి శాపంగా మారాయి

- డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు

నవతెలంగాణ-నిర్మల్

బీజేపీ, బీఆర్ఎస్‌లు రాష్ట్రానికి శాపంగా మారాయని, డీసీసీ అధ్యక్షులు కూచాడి శ్రీహరిరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని తన నివాసంలో దిలావర్‌పూర్ మండలం కదిలి, మాడేగాం గ్రామాలతో పాటు లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలతో ప్రజల బతుకులు ఆగమైపోతున్నాయని అన్నారు. రెండు ప్రభుత్వాలు ప్రజలకు చేసింది ఏమీ లేదని విమర్శించారు. తెలంగాణ అభివృద్ధిపై రెండు ప్రభుత్వాలకు ఏమాత్రం చిత్తశుద్ధి లేదని విమర్శించారు. స్థానిక మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి రెండు సార్లు ఓట్లు వేసి గెలిపించిన ప్రజలకు చేసిందేమీ లేదని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ అమలు చేసే మేనిఫెస్టోను ఇంటింటికి తీసుకెళ్లి నిర్మల్ జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేస్తామని దీమా వ్యక్తం చేశారు.



కార్యక్రమంలో నాయకులు ఒడ్నాల రాజేశ్వర్, రవీందర్ రెడ్డి, సాగర్ రెడ్డి, అర్గుల రమణ, హఫీజ్, సాయన్న పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-బేల

రైతులందరూ గులాబీరంగు పురుగు దశను గమనించి, మొదటి నుండి సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి ఫలితాలు పొందవచ్చని ఏఓ వెండి విశ్వామిత్ర అన్నారు. మంగళవారం మండలంలోని పాటన్ గ్రామ శివారులో పత్తి పంటను పరిశీలించి, పూతలో గులాబీ రంగు పురుగును గమనించి, వాటి దశను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ రైతులు మొదటి దశలో గులాబీ పురుగును గమనించాలంటే పత్తిలో గుడ్డిపూత, గమనించాలని, లేని యెడల ఎకరానికి 6నుండి 8లింగాకర్షక బుట్టలను పెట్టి దాని ఉధృతిని గుర్తించ వచ్చని అన్నారు. ఒక వేళ గులాబీ పురుగు పత్తి పంటలో ఆశించినట్లాయితే మొదటి పిచికారి వేప నూనెతో పాటు ప్రోఫోనో పాస్ పిచికారి చేయాలని అన్నారు. కానీ పత్తిలో 100రోజుల వరకు వీటి ప్రభావం ఉంటుందని తెలిపారు. పురుగు ఆశించిన అది తిన్న తరువాత చనిపోతుందనీ అన్నారు. ఏఓ వెంట విస్తరణ అధికారులు నగేష్, రాజు, సాయి, జావీద్, రైతులు గోడే విశాల్, రమేష్, బాపురెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

మంత్రి తలసాని క్షమాపణ చెప్పాలి



నవతెలంగాణ-భైంసా

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ మాజీ కోఆప్షన్ సభ్యులు సోలంకే భీంరావు పటేల్ అన్నారు. మంగళవారం నిర్మల్ జిల్లా భైంసా పట్టణంలో తెలంగాణ జాగృతి పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ సాధనలో ఉద్యమ నేత ప్రభుత్వ ఉద్యోగానికి స్వస్తి పలికి, ఉద్యమంలో పాల్గొన్న ప్రస్తుత భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మెన్ జాదవ్ రాజేష్‌బాబును అవమానించారని తీవ్రంగా ఖండించారు. కానీ ఎక్కడో హైదరాబాద్‌లో తెలిసి, తెలియని జరిగిన సంఘటనను, కొంత మంది రాజకీయ పరిజ్ఞానం లేని నాయకులు ముథోల్ నియోజకవర్గంలోని సోషల్ మీడియాలో ఎమ్మెల్యే బరిలో టికెట్ ఆశావహులకు ఇదే గతి పడుతోందని బీఆర్ఎస్ గ్రూప్‌లలో పోస్టులు పెట్టడం వలన జాదవ్ రాజేష్‌బాబు కుటుంబ సభ్యులతో పాటు ముథోల్ నియోజకవర్గంలో ఉద్యమకారులు కలత చెందారని అన్నారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను తక్షణమే బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ముథోల్ కోకన్వీనర్ భోస్లే పండిత్‌రావు పటేల్, పాంగ్రీ సర్పంచ్ ఆనందరావు పటేల్, భోజరాం, నాగన్న పాల్గొన్నారు.

ముథోల్ : ఇటీవల హైదరాబాద్‌లో మంత్రి కేటీఆర్ పాల్గొన్న కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబుపై మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అనుచితంగా ప్రవర్తించి, దాడి చేయడం తగదని మాజీ జెడ్పీటీసీ లక్ష్మీ నర్సాగౌడ్ అన్నారు. ఇలాంటి ఘటన జరగడం చాలా దురదృష్టకరమని అన్నారు. తోటి ప్రజాప్రతినిధిపై ఇలాంటి దాడి చేయడం సరియైన పద్ధతి కాదని పేర్కొన్నారు. అధికార మదంతో ఒక గిరిజన బిడ్డపై ఇలా వ్యవహరించడం సరైనది కాదని, వెంటనే మంత్రి బేషరతుగా రాజేష్‌బాబుకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటువంటి సంఘటనలను పునరావతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యుద్ఘాతంతో హెల్పర్‌కి గాయాలు

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లింగోజి తండ గ్రామానికి చెందిన జాదవ్ ప్రకాష్ మంగళవారం విద్యుద్ఘాతానికి గురైయ్యాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... లింగోజి తండ గ్రామ సమీపంలో పంట చేనులో విద్యుత్‌స్థంభం ఎక్కి మరమత్తులు చేస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ సరఫరా అయి విద్యుద్ఘాతానికి తగిలి స్థంభం పైనుండి పడిపోయాడు. వెంటనే గమనించిన స్థానికులు స్థానిక ప్రభుత్వ దవాఖాను తరలించి మెరుగైన చికిత్సకు ఆదిలాబాద్ రిమ్స్ తరలించారు. వైద్యుల సలహా మేరకు రిమ్స్ నుండి హైదరాబాద్‌కి తరలించారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ముదిరాజ్‌లకు సీట్లు కేటాయించకపోవడం సిగ్గుచేటు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో ముదిరాజ్ వర్గానికి చెందిన వారికి సీటు కేటాయించకపోవడం సిగ్గుచేటని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు శివయ్య ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం సభ్యులతో కలిసి సీఎం వైఖరిని ఖండించారు. రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. తెలంగాణ సాధన కోసం ఎందరో మంది ముదిరాజ్ బిడ్డలు ప్రాణ త్యాగాలు చేసి సాధించుకున్న తెలంగాణలో అత్యధిక జనాభా కలిగిన ముదిరాజ్ సామాజిక వర్గానికి అధికార పార్టీ ఒక్క సీటు కూడా కేటాయించకపోవడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో సుమారు 45 నియోజకవర్గాల్లో గెలుపు ఓటములను శాసించే సత్తా ఉన్న ముదిరాజ్‌లను విస్మరించడాన్ని ఎంత మాత్రం సహించేది లేదన్నారు. మరో 20 నియోజకవర్గాల్లో తమ ఓటు తాము వేసుకుంటే గెలిచే సత్తా ఉన్న తమ సామాజిక వర్గాన్ని సీఎం అంటరానివారుగా ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం హేయమైన చర్య అన్నారు. ఇప్పటికైనా అధికార పార్టీ వెంట తిరిగే ముదిరాజ్ సోదరులారా ఒకసారి ఆలోచించాలని, గత రెండు సాధారణ ఎన్నికల్లో ముదిరాజ్‌ల చేత ఆశీర్వాద సభలు ఆత్మీయ సమ్మేళనాలు పెట్టించుకుని ఓట్లు దండుకున్నారని అన్నారు. మనకు మాత్రం సీట్లు కేటాయించేందుకు ముందుకు రాకపోవడం విస్మయం కలిగిస్తుందన్నారు.



సమావేశంలో బొమ్మెన లక్ష్మణ్ ముదిరాజ్, వన్నెబోయిన చిన్నయ్య ముదిరాజ్, బొజ్జ గంగన్న ముదిరాజ్, ఈగల పోచ్చన్న ముదిరాజ్, దారవేణి రాము, ఓరుగంటి శ్రీనివాస్ ముదిరాజ్, ఇండ్ల భూమన్న ముదిరాజ్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి శైలజ ముదిరాజ్, మహాసభ పట్టణ మాజీ అధ్యక్షులు నర్సింగ్, జిల్లా కార్యదర్శి పాండురంగ్ ముదిరాజ్ ఉన్నారు.

ఉన్నతస్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆమెచ్యూర్ కబడ్డీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన జాతీయస్థాయి రిఫరీ టెస్ట్‌లో జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఉపాధ్యక్షులు నీరెటి విఠల్‌రెడ్డి అర్హత సాధించగా, జిల్లా కబడ్డీ అసోసియేషన్ సంయుక్త కార్యదర్శి బానోతు అక్షయ్, జిల్లా పోలీసు శాఖలో జూనియర్ అసిస్టెంట్ ఎంపికయ్యారు. వీరిని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పాయల్ శంకర్, రాష్ట్రపాల్‌లు మంగళవారం అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



నవతెలంగాణ-దండేపల్లి

ఉపాధ్యాయ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పీఆర్టీయూటీఎస్ అలుపెరుగని పోరాటం చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఇన్నారెడ్డి అన్నారు. మంగళవారం దండేపల్లి మండలంలోనీ కొర్విచెల్మ రెబ్బెనపల్లి, దండేపల్లి ఉన్నత పాఠశాలలలో, లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయించారు. ఈ సందర్భంగా ఇన్నారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరించడంలో తమ సంఘానిది కీలక పాత్ర అని అన్నారు. త్వరలోనే ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల బదిలీలు, హెల్త్ కార్డు సమస్యలు పరిష్కారం అవుతాయని అన్నారు. పీఆర్టీయూటీఎస్ అతిపెద్ద సంఘంగా ఉపాధ్యాయుల సమస్యలపై అనేక ఉద్యమాలు, పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఐర్‌తో కూడిన పీఆర్సీని వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావణవేణి రవి, మల్యాల మల్లేష్, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు వరలక్ష్మి, విజయేందర్ రాజు, మండల అసోసియేట్ అధ్యక్షులు నరేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాత రమేష్, శ్రీనివాస్, రాజేశ్వరి, రమేష్, షరీఫ్‌ఉద్దిన్, అత్తరాజ్, ముత్యం నాగ వర్మ పాల్గొన్నారు.

మార్లావాయిలో ప్రపంచ జానపద దినోత్సవం



నవతెలంగాణ-జైనూర్

మండలంలోని మార్లావాయి గ్రామంలో స్థానిక సర్పంచ్ కనక ప్రతిభ వెంకటేశ్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం భాష సంస్కృతి శాఖ సౌజన్యంతో ప్రపంచ జానపద దినోత్సవాన్ని పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు గుస్సాడీ శిక్షణ కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది తెగల కళాకారులతో ఆదివాసీ వాయిద్య కళాకారులు కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ కళా ప్రదర్శనలో తెలంగాణ రాష్ట్ర జానపద కళా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వంగ శ్రీనివాస్‌గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో విశిష్ట అతిథిగా పద్మశ్రీ అవార్డు గ్రహీత కనక రాజు, రాష్ట్ర కార్యదర్శి మధూకర్, మానవహక్కుల వేధిక రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భుజంగ్‌రావు, ఆదివాసీ రాష్ట్ర కార్యదర్శి ఆత్రం సుగుణక్క, స్థానిక కళాకారుడు కనక సుదర్శన్, ముదిరాజ్, ఆత్రం శేషునారాయణ్ పాల్గొన్నారు.

మంత్రి తలసాని దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-దిలావర్‌పూర్

భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ రాజేష్‌బాబుపై తలసాని శ్రీనివాస్‌యాదవ్ చేసిన వ్యాఖ్యలకు, చేయి చేసుకోవడాన్ని నిరసిస్తూ మంగళవారం నర్సాపూర్(జి) మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గిరిజన లంబాడా జేఏసీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి, ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. గిరిజన లంబాడా జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్ నాయక్ రాథోడ్ మాట్లాడుతూ తలసానిని వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అన్నారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల జేఏసీ అధ్యక్షులు మురళి, హరిలాల్, శ్రావణ్, ధరావత్ రవీందర్ నాయక్, కిషోర్, డాక్టర్ ఉత్తం, పండిత్ నాయక్, శంకర్ నాయక్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

హైదరాబాద్ పోలీసులను సర్వీస్ నుంచి తొలగించాలి

నవతెలంగాణ-జన్నారం

ఆగస్టు 15 రోజున గిరిజన మహిళను తీవ్రంగా కొట్టి ఆమెను అవమానించిన హైదరాబాదు పోలీసులను వెంటనే సర్వీసు నుంచి తొలగించాలని తెలంగాణ రాష్ట్ర బంజారా యువ సేనా రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రెస్ క్లబ్ ల నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో గిరిజన యువతులు మహిళలపై అనేక ఆకృత్యాలు అత్యాచారాలు జరుగుతున్న సంబంధిత అధికారులు గాని ఎస్సీ ఎస్టీ కమిషన్లు గానీ స్పందించకపోవడం దారుణమని, బాధిత గిరిజన మహిళకు రూ.కోటి నష్టపరిహారం కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలన్నారు. మానవ హక్కుల సంఘం అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ కమిషన్ ఈ విషయాన్ని సుమోటోగా స్వీకరించి వెంటనే కేసు నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా అధ్యక్షులు బాదావత్ శ్రీనివాస్ నాయక్, మండల అధ్యక్షుడు భూక్యా సంతోష్ నాయక్, ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కర్ణ నాయక్ పాల్గొన్నారు.

పూలాజీబాబా జయంతిని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-జైనూర్



పూలాజీబాబా 99వ జయంతి కార్యక్రమానికి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సిద్ధేశ్వర్ సంస్థాన్ అధ్యక్షుడు కేశవ్‌రావు ఇమ్లె అన్నారు. మంగళవారం పాట్నాపూర్ సిద్ధేశ్వర ఆలయం ముందు పూలాజీబాబా జయంతి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 30వ తేదీన పూలాజీబాబా జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. 99వ జయంతికి పూలాజీబాబా భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ప్రమాద రహిత గనులుగా పేరు తేవాలి



నవతెలంగాణ-నస్పూర్

భూగర్భ గనుల్లో ప్రమాదాలను నియంత్రించాలని బెల్లంపల్లి రీజియన్ రక్షణ జనరల్ మేనేజర్ కె.హరినారాయణ గుప్తా పేర్కొన్నారు. మంగళవారం ఆర్కే-న్యూటెక్ గని వద్ద నిర్వహించిన కార్యక్రమంలో భూగర్భ గనుల్లో పాటించాల్సిన రక్షణ సూత్రాలు, తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలపై ఉద్యోగులకు ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రీజియన్ జీఎం(రక్షణ) కెహెచ్ఎన్ గుప్తా మాట్లాడుతూ గనుల్లో ఉద్యోగులు ఆలోచన నైపుణ్యంతో విధులు నిర్వహించాలని సూచించారు. నిర్లక్ష్యం, అజాగ్రత్త, తొందరపాటుతో పనులు నిర్వహించి ప్రమాదాల బారిన పడొద్దని పేర్కొన్నారు. ఇటీవల కంపెనీ వ్యాప్తంగా భూగర్భ గనుల్లో జరుగుతున్న ప్రమాదాలు ఆందోళనలు కల్గిస్తున్నాయని తెలిపారు. పని స్థలాలపై పూర్తిగా అవగాహన పెంచుకొని సూపర్‌వైజర్లు ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. ప్రమాదరహిత ఉత్పత్తికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. ఉద్యోగులు ఆహార నియమాలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. రక్తపోటు, మధుమేహం వంటి వ్యాధులకు గురికాకుండా నిత్యం యోగా, వ్యాయామం చేయాలని తెలిపారు. అనంతరం గనిలోని పని స్థలాలను పరిశీలించారు. పని ప్రదేశాల్లో ఉద్యోగుల పనితీరును పరిశీలించి రక్షణ చర్యలపై సూచనలు, సలహాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రూపు ఏజెంట్ మాలోత్ రాముడు, ఎస్ఎంటీసీ మందమర్రి ఇన్‌ఛార్జి విజయ్ కుమార్, గని ఎస్ఎం ఇ.స్వామిరాజు, గ్రూపు ఇంజినీర్ రవిచరణ్, గని రక్షణాధికారి కొట్టె రమేష్, పిట్ కార్యదర్శి ఎం.జంపయ్య, సంక్షేమాధికారి పాల్ సృజన్, పిట్ ఇంజినీర్ రాజగోపాలచారి పాల్గొన్నారు.

సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం ఎన్నిక

నవతెలంగాణ-వాంకిడి

మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో తెలంగాణ సమగ్ర శిక్షణ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం ఆ సంఘం మండల కమిటి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా శృతిక, ఉపాధ్యక్షులుగా కవిత, రవీందర్, ప్రధాన కార్యదర్శిగా తిరుమల, సహాయ కార్యదర్శులుగా స్వప్న, వెంకటేశ్, కోశాధికారిగా శైలజ, అధికార ప్రజా ప్రతినిధిగా దుర్గం సందీప్, సాంస్కృతిక కార్యదర్శులుగా సరస్వతి, దీపిక, నాయకపు సలహాదారులుగా శైలజ, ఉజ్వల, మౌనిక, సభ్యులుగా విజయ్‌బాబు, సునీల్, యశంత్, తులసీరాం, సువర్ణ, వెంకటలక్ష్మి, స్వాతి, చందనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ప్రభుత్వ భూములను అమ్మి గ్రామాలను అభివృద్ధి చేస్తాం

- సర్వసభ్య సమావేశంలో వినతి పత్రం అందజేత

నవతెలంగాణ-కుభీర్



ప్రభుత్వ భూములను అమ్మి గ్రామాలను అభివృద్ధి చేస్తామని, అందుకు జీఓను ఇవ్వాలని సిరిపెల్లి గ్రామ సర్పంచ్ రాజేందర్ అన్నారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తూము లక్ష్మీబాయి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, ఆయా శాఖల అధికారులు హజరయ్యారు. ఈ సమావేశంలో తమ శాఖ పరిధిలోని ప్రగతినివేధికను చదివి వినిపించారు. మొదటగా రెవెన్యూశాఖకు డీటీ పద్మావతి తమ నివేదికను చదువుతుండగా, సిరిపెల్లి గ్రామసర్పంచ్ రాజేందర్ సమావేశంలో విన్నూత వినతిపత్రం అందజేశారు. అందులో గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న ప్రభుత్వ భూములను అమ్ముకునేందుకు అవకాశం కల్పించేలా జీఓ ఇవ్వాలంటూ పేర్కొన్నారు. అదేవిధంగా ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. గ్రామంలో ఉన్న సమస్యలకు నిధులు లేక సర్పంచులు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పారిశుధ్య కార్మికులకు వేతనాలు, ట్రాక్టర్ నిర్వహణ కొరకు ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో రాష్టంలో చాలా మంది సర్పంచులు ఆత్మహత్యలు చేసుకున్నారని అన్నారు. అదేవిధంగా మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని అన్నారు. దీంతో సంబంధిత శాఖ అధికారికి ఫోన్ ద్వారా సమాచారం చెప్తే ఏమైతే అది చేసుకో అని సమాధానం ఇస్తున్నారని అన్నారు. మిగితా శాఖలకు చెందిన అధికారులు తమ తమ శాఖ అధికారులు నివేదికలను చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఆల్కతాయి సంజయ్, వైస్ ఎంపీపీ మోహియోద్దీన్, కోఆప్షన్ సభ్యుడు దత్తుహరి పటేల్, ఎంపీడీఓ లింబాద్రి, ఎంఈఓ చంద్రకాంత్, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు ఉన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన తహసీల్దార్ గోపాల్, డీటీ మానిక్ రావులను ఆదివాసీ హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో శాలువాలతో సన్మానించారు. ఆదివాసీల సమస్యల పరిష్కారించే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి సోయం జంగు, ప్రధాన కార్యదర్శి మడావి వెంకటేశ్, ఉపాధ్యాక్షుడు పెంద్రం శంకర్, ఆత్రం సంజీవ్, కోశాధికారి పెంద్రం. ప్రభాకర్, మడావి గంగారాం. ఆత్రం మహేశ్, చిత్రం రాందాస్ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

బీఆర్ఎస్ అధినేత ముఖ్యమంత్రి కేసీఆర్ ఎమ్మెల్యే అభ్యర్థులను సోమవారం ప్రకటించిన నేపథ్యంలో జిల్లా నాయకులు ప్రగతి భవన్‌లో ఆయనను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడిగా పనిచేసి అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని సీఎం సూచించినట్లు వారు వివరించారు. సీఎంను కలిసిన వారిలో ఎమ్మెల్యే ఆత్రం సక్కు, ఆసిఫాబాద్ అభ్యర్థి జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవలక్ష్మి, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, చెన్నూరు ఎమ్మెల్యే బాల్క సుమన్, జడ్పీటీసీ నాగేశ్వరరావు, సింగిల్ విండో చైర్మన్ అలిబిన్ అహ్మద్‌లు ఉన్నారు.

ఒకే కుటుంబంలో ఇద్దరికీ ఆర్మీ ఉద్యోగాలు

నవతెలంగాణ-జన్నారం





మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన రామిల్ల సత్తయ్య-లక్ష్మీ దంపతుల కుమారులు రామిల్ల హరీష్, సురేష్, అన్నదమ్ములు ఆర్మీలో ఉద్యోగాలు సాధించారు. వారికి సోమవారం తిమ్మాపూర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ జాడి గంగాధర్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత దేశభక్తిపై మక్కువ పెంచుకొని ఆర్మీలో ఉద్యోగాలు సాధించాలన్నారు. యువతకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు జాడి వెంకట్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రయ్య, శ్రీనివాస్, మల్లేష్, గంగాధర్, రవి, శంకర్ పాల్గొన్నారు.